5924
3-6B



4969

మాత్రం సంపాదించుకోవా ఏమిటి?"

"వద్దు తల్లీ వద్దు. అలాంటి పాపిష్టి సంపాదన నే నెప్పుడూ ఆశించలేదు. ఆశించను."

"సరే, ఇంతకీ నేనొచ్చినపని మరిపించి ఏదేదో చెప్తున్నావ్."

4969

"ఏమిటో అది?"

"మా లేడీస్‌క్లబ్ ఆర్గనైజేషన్......?"

"ఓ! దివ్యంగా చేసుకోండి, నా అనుమతి దేనికి?"

"పోదూ, నీబోడి అనుమతి ఎవరిక్కావాలి గానీ.... ఎగ్జిబిషన్ మూడు రోజులు జరుగుతుంది."

"చిత్తం."

"చెప్పానుగా పెద్ద పెద్దవాళ్ళంతా వస్తారనీ...వాళ్లందరితో మా ఆర్గనైజేషన్ మెంబర్స్‌ఫోటో, విడిగా నా ఫోటో తీసి మీ పత్రికలో వేసి, గొప్పగా రాయాలి నువ్వు!"

ధీరజ్ మౌనంగా చూడసాగాడు.

"ఈ ఎగ్జిబిషన్‌లో మాక్లబ్ మెంబర్స్ చేతిపనులు, కుట్లూ, అల్లికలూ, పెయింటింగ్సూ అన్నీ వుంటాయి. వసూలైన డబ్బు యుద్ధవీరుల వితంతువులకు వినియోగించేట్టుగా మంత్రిగారికి అందజేస్తాం."

"శభాష్! ఇందులో తమ స్వంతానికి ఎంత ఫర్సంట్ కొట్టివేయ దల్చుకున్నారు.

"అదుగో.......మళ్ళీ మొదలుపెట్టావ్. ఇంతకూ నేనడిగిన విషయం యేంచేశావ్?"

5924
3-6B

Kowsalya Devi



"ఆ రోజుల్లో నేను రాజధానిలో వుండవలసిన అఫీషియల్ ప్రోగ్రాం వున్నది. అంచేత నావల్ల ఏమీ కాదు?

"పోనీ......నీ తోటి వారెవరికైనా చెప్పి ఏర్పాటు చేయవచ్చుగా?"

"శైలూ! నాకిలాంటివి అస్సలు అలవాటులేదని తెల్సు. ఎందుకు చెప్పు ఇతరులతో ఆబ్లిగేషన్స్? ఈ రోజు 'మా చెల్లాయ్ లేడీస్‌క్లబ్‌ను గురించి నువ్వు బ్రహ్మాండంగా రాయవోయ్ మిత్రమా!' అని ఎవరికైనా చెప్పి వినియోగిస్తే రేపు వాడు వాడి చుట్టం ఎవడైనా వాగిన తప్పుడు ఉపన్యాసమంతా ఘనంగావుందని ఆకాశానికెత్తుతూ రాయమంటాడు; లేదా ఏ చెత్త చిత్రాన్నో ఆదర్శంగా వుందని పొగడమంటాడు. అంచేత నేనిటువంటివాటికి చాలా దూరంగా వుంటాను, తప్పుడు రాతలు రాసి, లోకులచేత 'ఛీ' అనిపించుకోకుండా."

శైలజ ముఖంలో రంగులు త్వర త్వరగా మారిపోయాయి. ధీరజ్ ఎంత నిక్కచ్చి మనిషైనా, చెల్లెలి నిరుత్సాహ వదనం చూచి బాధపడ్డాడు. "ఈసారికి ఎలాగో కానిచ్చుకోండి శైలూ, మరో ఆర్గనైజేషన్ చేసేప్పుడు నాకు ఓ నెల ముందుగానే చెప్తే తప్పకుండా నీవు కోరినట్లే చేసిపెడతాను!" అన్నాడు.

"శైలజ సంతోషించింది. ప్రామిస్!" అన్నది చేయి చాపుతూ.

"యస్ ప్రామిస్."

"హమ్మయ్య. ఆమాత్రం భరోసాఅయినా యిచ్చావ్,

ఈసారికి మా వాళ్ళ కెలాగో సర్ది చెప్తాను."

"ఏం, ముందే డబ్బా వాయించి వచ్చావా?"

"కాదా మరి! మీ అన్న పత్రికా విలేఖరి—అదీ యిదీ అంటూ వాళ్ళే మొదలు పెట్టారసలు. నువ్వు కాదన వనుకుని నేను గర్వంగా ఒప్పుకుని వచ్చాను. ఇప్పుడు హేళన చేస్తారు."

"ఈసారి నీ మాట చెల్లిస్తాలే. కానీ......నాదొక్క సలహా—కోపం రాదంటే చెప్తాను."

"ఏమిటి?"

"ఫోటోలూ, ఆర్భాటాలూ చూసి ప్రజలు ఏమను కుంటారూ? వీళ్ళకి నిజంగా వార్ విడోస్‌పైన జాలా లేక ఈ ప్రచారమూ కీర్తిలపై మోజా? అని అనుకోరూ?"

శైలజ ఏమీ సమాధానం చెప్పకున్నా ఆమెమనస్సు లోని కోపం గిరుక్కున తిరిగిపోవడంలోనే స్పష్టమైంది.

కథానిలయం
శ్రీకాకుళం

2

"అమ్మాయ్! మీ అమ్మ వుందా లోపల?"

అతి నాగరికంగా అలంకరించుకుని, స్నేహితురాలి కారుకోరకై ఎదురు చూస్తూన్న శైలజకు ఈ కంఠమూ, ప్రశ్నా అసలు విన్పించలేదు.

"నువ్వు...నువ్వు...శైలజవేనామ్మా?"

స్లీవ్ లెస్ బ్లౌజ్‌పై నైలాన్ పమిటను వుంచడమూ, లేక తమాషాగా జారవిడవటమూ అనే డైలెమ్మాతో అనేక రకాలుగా సర్దుకుంటున్న శైలజ ఈసారి తల త్రిప్పి చూచింది విసుగ్గా.

వీధి గేటుదగ్గఱ ఒక వృద్ధురాలూ, ఒక యువతీ, ఒక బాలుడూ నిలబడివున్నారు. శైలజనే ఆత్రంగా ఆశగా చూస్తూన్న ఆ ముగ్గురూ దీనాతి దీనదశలో నున్నట్లుగా వారి జీర్ణవస్త్రాలూ, శుష్కదేహాలూ విశదీకరించు తున్నాయి.

అసహ్యంగా, విసుగ్గా కోపంగా చూచింది శైలజ.

"నా పేరుకూడా ఎలా తెలిసిందే ముష్టిదానా నీకు? నువ్వు నువ్వంటూ మాట్లాడ్తున్నావ్, జాగ్రత్త!"

ఈ క్రోధవాక్యాలు విని ఆ ముగ్గురి కనులలోనూ నీరు ఉబికింది.

"అదికాదమ్మా, నన్ను నీవెరుగవ్, నేను ముష్టిదాన్ని కాను..." ఆ ముగ్గురిలో వృద్ధురాలు ఏదో చెప్పబోయింది కానీ శైలజ ఆ అవకాశమివ్వలేదు,

"ముష్టిదానవు కాకపోతే ఎప్పుడైనా గిన్నెలుతోమే దానివేమో మా యింట్లో, పో పో, ఇప్పుడెవరికీ ఖాళీలేదు. తెల్లారి లేస్తే నీవంటి కట్టుకథలు చెప్పి అడుక్కునేవాళ్ళు లక్షమంది!"

"ఎవరే శైలూ? ఎవరితో నీ మాటలు?" సుమతి బయటికి వచ్చింది.

"ఎవళ్ళో దారినపోయేవాళ్లు. అడుక్కోటం వృత్తియి

పోయిం దీమధ్య సగం జనాభాకు." విసుగుదలగా అంటూన్న శైలజ వదనం అంతలో వికసించింది. "అదుగోనమ్మా, మా నందిని కారు వచ్చేసింది; వెళ్తున్నానూ, నా ఉపన్యాసం అదీ వున్నాయి ఈ రోజు క్లబ్‌లో. చాలా ఆలస్యమైపో తుంది వచ్చేసరికి, టాటా!"

పోకులు ఒలికించుతున్న శైలజను తీసుకుని దూసుకు పోతున్న కారు దెస నిట్టూర్పుతూ చూచింది సుమతి.

ఎక్కడో యుద్ధంవలన దిక్కుమాలినవారైన వారి కొఱకు రెండు నెలలుగా తాపత్రయపడి ప్రదర్శనలూ, సభలూ ఏర్పాటుచేస్తూ, పదిరోజులుగా ఉపన్యాసం కంఠస్తం చేస్తూన్న దేశభక్తురాలికి తన ద్వారం చెంత - తన గృహ ప్రాంగణంలో నిలబడిన దీనార్తుల విన్నపమేమిటో వినే వ్యవధీ, ఓర్పుకూడా లేవు!

కుమార్తెయొక్క ఈ వింత పోకడలకు విచారిస్తూ సుమతి ఆ ఆగంతకులదెస తిరిగింది. శైలజ విదిలింపులకు విచలితులైన ఆ వ్యక్తులు నిరాశజెంది, ఇక సుమతి ఏమం టుందోననే భయ సందేహాలతో మూగగా చూడసాగారు.

కట్టుగుడ్డలు కాక చంకన ఓ చిన్న మూటకూడా లేని ఆ నిర్భాగ్యులను జాలిగా చూస్తూ "ఏమి కావాలి?" అని అందంగా అడుగుతూ, అంతలోనే ఆశ్చర్యోత్సాహంతో దిగ్భ్రాంతురాలై నిలచిపోయింది సుమతి వారినే తదేకంగా చూస్తూ.

సిగ్గుతో, అవమానంతో కుంచించుకు పోయినట్లుగా తలవాల్చుకు నిలబడిన ఆ యువతి ముఖం సరిగ్గా కన్పించటం

లేదు. చిరుగుల చీర కొంగునే నెత్తిమీదకూడా కప్పుకున్నది. సుమతినే తదేకంగా చూస్తూన్న వృద్ధురాలి నేత్రాలు ధారాపాతంగా వర్షించసాగాయి.

"ఎవరూ? ఫాతిమా!?" అరచినట్లే ఆశ్చర్యంతో గావుకేక పెడుతూ ఒక్క ఉదుటున వరండా దిగి, పరుగున గేటువద్దకు వెళ్ళి ఆమెను కౌగలించుకున్నది.

"సుమతీ దీ! గురుతువుంటినా?" యాస తెలుగులో మాట్లాడుతూ ఆ వృద్ధురాలు ఫాతిమా, సుమతి పాదాలు పట్టుకొని భోరుమన్నది.

ఆ యువతీ, బాలుడూ మౌనంగా దుఃఖించసాగారు. సుమతి నేత్రాలు కూడ అశ్రుసిక్తమైనాయి.

"ఛ. ఏమిటి, లే." కాళ్ళ వద్దనుండి ఫాతిమాను లేవదీసింది. "రండి లోపలికి."

"సుమతీ దీ!......" ఏమిటో చెప్పే ప్రయత్నం చేసింది ఫాతిమా. కానీ, దుఃఖంతో పూడిపోయిన గొంతు నుండి మాటలు రాలేదు!

"ఒద్దు, ఏమీ చెప్పొద్దిప్పుడు. నడవండి లోపలికి." ఆదరంగా భుజంపై చెయ్యివేసి తీసుకువెళ్ళింది.

"నా కోడలూ, మనుమడూ" అని చెప్పింది, కొంత దుఃఖవేగం తగ్గిన పిమ్మట ఫాతిమా.

"నడవండి, స్నానాలు చేయండి. మాటలు తర్వాత." తన చీరలు యిచ్చింది సుమతి అత్తా కోడండ్రిద్దరికీ. స్నానాలు చేసి వచ్చేసరికి భోజనాలు సిద్ధంగా వుంచింది.

"వంటగదిలో వద్దు లేదీదీ. బయట....."

ఫాతిమా మాటలను పూర్తి కానీయలేదు సుమతి. "అలా మాట్లాడి నన్ను చిన్నబుచ్చవద్దు దీదీ, శైలజకు పెళ్ళయినా ఏమిటో కుఱ్ఱతనమూ, పొగరూ వదలలేదు. దానిమాటలు లెఖ్ఖజేసుకోవద్దు."

"అందుకు కాదు."

"మరి? ఈ నా జీవితమంతా నీ చలవ కాదా దీదీ? ఒకనాడు నీవు పెట్టిన ప్రాణభిక్షను నేను మరువలేదు. అంతటి విశ్వాస ఘాతకురాలిని కాను."

"........."

"ఊఁ. మాటలు వద్దు. ముందు భోజనాలు కానీయండి. చూడూ, పిల్లవాడెంత నీరసంగా వున్నాడో? నువ్వు తినమని చెప్తే......"

వారు తినే తీరు చూస్తూంటూనే సరైన భోజనం కళ్ళజూచి ఏనాడైందో అన్నట్లుగా వున్నది. పిల్లవాడు మరీ ఆబగా, ప్రాణం లేచి వచ్చినట్లుగా భోజనం చేయడం చూచిన సుమతి హృదయం నీరే అయ్యింది.

భోజనానంతరం పడకగదిలోనికి తీసుకువెళ్ళింది.

"పడుకోండి, కొంతసేపు విశ్రాంతి తీసుకోండి." తానూ ఒక మంచంపై కూర్చుంటూ, ఆ బాలుని ఒడిలోకి తీసుకున్నది సుమతి. మరుక్షణంలోనే గాఢనిద్ర కొరిగాడు.

"నీ పేరేమిటమ్మా?" యువతిని చూస్తూ అడిగింది సుమతి. ఆమె తలవాల్చుకున్నది.

"మాం భాషా, కొంచం హిందీమాత్రమే వచ్చును." ఫాతిమా చెప్పింది. "రజియా పేరు." అంటూనే ఆమె

కన్నులు జలపూర్ణమైనాయి. "దీదీ, నీపై ఎంతో ఆశపెట్టుకు వచ్చాం. కొంతకాలం మాకాశ్రయ మీయగలవా?"

"ఇది మీ యిల్లుగానే భావించండి." సుమతి హిందీలో చెప్పింది రజియాకు కూడా అర్థంకావాలని. "ఆశ్రయం— అలాంటి మాటలు వద్దు కష్టకాలం వచ్చింది వచ్చారు, లేకుంటే ఎందుకొస్తారు యిల్లూ, దేశం వదలుకొని!"

నొప్పులతో పీకుతూన్న కాళ్ళను సవరించుకుంటూ కూర్చున్నది రజియా. ఆ కాళ్ళు పుళ్ళుపడి వున్నాయి. చేతులూ, ముఖమూ అన్నీ గాయాల ఆనవాళ్లు, ఫాతిమాకూ, మనుమడికీ కూడ శరీరాలపై గాయాలున్నాయి కానీ, రజియాకు మరీ అధికంగా ఘోరంగా వున్నాయి.

"ప్రస్తుతం మేము సర్వం కోల్పోయి కట్టుగుడ్డలతో మిగిలిపోయాం దీదీ! నా కొడుకు నజీర్ బ్రతికివున్నాడో లేదో కూడా తెలియదు." తమ కథకు ఉపోద్ఘాతం ప్రారంభించింది ఫాతిమా.

"పాకిస్తాన్ అల్లరులు మీకు తెలుసనుకుంటాను?" ఫాతిమా ప్రశ్నించింది.

"ఆఁ. ఎందుకు తెలియదూ? బాంగ్లాదేశ్ కోసం అంటూ..."

"ఆఁ. అదే మాలాంటి వాళ్ళందరి కొంపలూ తీసింది. ఆ దేశంనుండి కట్టుగుడ్డలతో ఈ దేశం వచ్చి పడ్డాం. కుక్కల కంటె కనా కష్టమైన పాట్లు పడ్డాం."

"ఎలా తప్పించుకో గలిగారో నా కాశ్చర్యంగా వున్నది. చాలా ఘోరాలు జరుగుతున్నాయని విన్నాను."

“ఔను.” చాలా తగ్గుస్థాయిలో చెప్పసాగింది ఫాతిమా; “ఔను, ఏంపాపం చేశామో– అన్ని ఘోరాలూ అనుభవించాం. కళ్ళ చూచాం.” ఉబికి వస్తూన్న కన్నీటిని కట్టటానికి శతవిధాల ప్రయత్నం చేయసాగింది.

శిలలాగా ఏ చలనమూ, భావ ప్రకటనా లేకుండా గోడవేపు చూస్తూ కూర్చున్నది రజియా.

కొంత శోకించి, మరల చెప్పసాగింది ఫాతిమా. “ఏమాత్రం పారిపోయే అవకాశం లేకపోయింది. తెల్లవారు ఝామువేళ - నిద్దలలో ఆదమరచి వున్నాం. అంతలో ఏమిటో ఉప్పెనలాగా అరపులూ, కేకలూ, పరుగులు...ఆ భీభత్సం ఏమిటో తెలియలేదు కొన్ని నిముషాలు. మా వీధి తలుపులు ఎవరో దబ దబ బాదుతున్నారు......‘అమ్మ బాబోయ్! పారిపోవాలి. విప్లవం’ అని యేమేమో అంటూ నజీర్ అటూ యిటూ ఒక్కసారి పిచ్చివాడిలాచూచి వెనుక దొడ్లోకి పరుగుతీస్తూ “రండి, ఏమీ ఆలస్యం చేయవద్దు, పరుగెత్తాలి,” అన్నాడు. ఏడుస్తూ నిద్రపోయే ఇద్దరు పిల్లలనూ చెరొకరం పట్టుకొని నేనూ, రజియా పరుగులు పెట్టాం. కాని...కానీ...ఆ పెద్దగోడ ఆడవాళ్ళం ఎలా ఎక్కి దూకగలం? నజీర్ వెళ్ళిపోయాడు. ఆ ఖంగారులో ఎవరికెవరం? “నేనూ రజియా ఒకరినొకరం పట్టుకొని ఏడవసాగాం. బయట తలుపులు బ్రద్దలైనట్లున్నాయి. సైనికుల బూట్లచప్పుడూ వికటహాసాలూ వినవస్తున్నాయి. దైవంపై భారంవేసి చెట్ల గుబురులలో దాకున్నాం, పిల్లలను గుండెలకు హత్తుకుని.

“మా ఖర్మ కాలిపోయింది. ఇల్లంతా వెతికి వెతికి

ఆవరణలోకి వచ్చారు నలుగురు సైనికులు. అన్నీ వెదికి వెదికి చెట్లు కదిలించి, పోతూ పోతూ ఒకడు మళ్ళీ వెనక్కు వచ్చి తుపాకి మడమతో ప్రతి గుబురూ పొడిచి చూడ సాగాడు. రజియా ఒడిలోనున్న రెండేళ్ళ బిడ్డ కెవ్వుమన్నది!" చెప్పడం ఆపి కన్నీరు మున్నీరుగా విలపించసాగింది.

గుండెలు బిగబట్టి వింటూన్నది సుమతి.

"ఇంకేముంది? రజియాను జుట్టుపట్టి బయటకీడ్చారు నలుగురు కిరాతకులూ... చెప్పలేను నేను. అల్లా యెందుకింత కఠినంగా రాశాడో దాని ముఖాన. ఏడుస్తూన్న పసిదాన్ని ఖండ ఖండాలుగా నరికిపారేసాడొకడు... నేనూ, అహ్మద్ ఏడుపు దిగమింగుకొని, గుండెలుగ్గపట్టి అలాగే మొద్దుబారి పోయి, ఆ పొదమాటున పడివున్నాం.

"స్పృహ తప్పిపోయిన రజియాను 'చచ్చింది!' అని వికటంగా నవ్వుకుంటూ ఒక్క తాపు తన్ని నలుగురు రాక్షసులూ పోయారు. యిల్లంతా వెదకుతూన్న చప్పుడు... నేనుకూడా రజియా చచ్చిపోయిందనే అనుకున్నాను. కిరాతకులు నగరంలో మరో భాగపు యిండ్ల కళలను అపహరించటానికి పోయినట్లున్నారు. కలకలం చాలా దూరంగా వినవస్తూన్నది. మెల్లగా బయటకువచ్చి రజియా ఒంటిమీద గుడ్డలు కప్పి చేతనైన శైత్యోపచారాలు చేశాను. సూర్యరశ్మి వచ్చేవేళకు రజియాలో కొంత చైతన్యం కన్పించింది. మూలుగుతూ అశాంతిగా అటూ యిటూ దొర్లసాగింది. టీతయారు చేయటానికి ధైర్యంచేసి లోపలికి వెళ్ళాను. ఏమిటి, అది యిల్లా, శ్మశానమా? ఎలాగుందని? అన్ని వస్తువులూ

బోర్లద్రోసి, విరగగొట్టి..."

"ఏడుస్తూన్న అహ్మద్ నోరునొక్కి కొద్దికొద్దిగా చాయ్ గొంతులో పోసేసరికి మెల్లమెల్లగా గుటకపడింది. కాని ఆ శోకం......కన్నబిడ్డ శరీరం ముక్కలై కళ్ళెదుట పడివున్నది...మాన మర్యాదలు బుగ్గిపాలైనాయి. ఏడ్చిఏడ్చి బలవంతంగా ప్రాణాలు తీసుకోబోయింది. కానీ ఎలాగో అడ్డబడి సాంత్వనపఱచగలిగాను, అహ్మద్ కొంత ఊహ తెలిసినవాడు. తల్లిని పెనవైచుకొని భోరుమన్నాడు."

విని విని ఇక నిగ్రహించుకోలేని సుమతి కూడ వెక్కివెక్కి ఏడ్వసాగింది.

ఒకవంక రజియా ముఖం చేతులలో దాచుకొని క్రుళ్లి క్రుళ్లి ఏడుస్తూన్నది.

"ఇంటింటా జరిగాయి ఈ అత్యాచారాలు - సరిగా నైజాంలో ఒకనాడు రజాకార్ల దుండగాలు జరిగినట్లే. ఎందరు మరణించారో, ఎందరు చెట్టుకొకరూ పుట్టకొకరూ అయిపోయారో వాళ్ళ చేతబడిన ఏ స్త్రీకీ మర్యాద నిలవ లేదు."

"ఏం చేయం ? ఎంత విరక్తి పుట్టినా బ్రతుకుతీపి యింకా చావలేదు. ఎందుకు బ్రతికున్నామో తెలియదు. ఆ దురంతం జరిగిన రెండుగంటల తర్వాత మఱలా కొందరు యువకులు వచ్చారు. వారి చేతులలో కూడా ఆయుధాలున్నాయి. మా పైప్రాణాలు పైననే ఎగిరిపోయాయి... కానీ వారు దుండగులూ, శత్రువులూ కారు. దాగివుండి, ఈ అన్యాయాలను మాపటానికీ, పాకిస్తాన్ విభజనకూ ప్రయ

త్నిస్తున్న దేశభక్తులు. వారు ఒక దళంగా యేర్పడి, చాటు మాటుగా ఆయుధాలను కూర్చుకొని మావంటి నిస్సహాయులకు తోడ్పడుతున్నారు. వారి సాయంవల్ల మేము ఆదేశం దాటి రాగలిగాం. ఏదో కొంత నగా, నగదూ వెంట తెచ్చుకున్నాం. కొన్నాళ్ళు దానితో గడుపుకొన్నాం. మీరిక్కడ వున్నారో లేదో తెలియదు, నీళ్ళు నాల్గు నోలలైంది నాకు వుత్తరం వ్రాసి."

"ఆ తర్వాత వ్రాశాను. అందలేదన్నమాట? నిత్యం ఈ అల్లర్లూ, యుద్ధమూ గురించి రేడియోలో వింటూంటే మీరే గుండెలలో మెదులుతున్నారు. ఏమో, బాగానే వున్నారేమో అనుకుంటున్నాను కానీ, యింత ఘోరం ఊహించనుకూడా లేదు. నజీర్ మంచి ఉద్యోగంలో హోదాలో వున్నాడు. ఇటువంటివారికికూడా ఈ కష్టాలొచ్చాయని తెలియలేదు."

"మాకంటె గొప్పవాళ్ళు కూడా అలాగే ఎన్నో దారుణాలకు బలౌతున్నారు. కట్టు గుడ్డలతో పారిపోయారు, ఇంకా పోతున్నారు. కానీ......ఆ శరణార్థుల కొంపలు ఎలా వుంటాయో మాకు తెలుసు. అందుకు మేమక్కడ జేరలేదు. అలా తినీ తినకా ఇక్కడికి జేరుకున్నాం. ఇంక నువ్వే శరణు దీదీ. కొంత ఆశతో వచ్చాను."

"అమ్మా!" ధీరజ్ వస్తూ, నూతన వ్యక్తులను చూచి ఆగిపోయాడు.

"రా ధీరూ, ఎవరొచ్చారో చూడు!" అన్నది సుమతి. ధీరజ్ సంశయంగా చూచాడు.

4969



రజియా కంగారుపడుతూ ఒక మూలకుపోయి ముఖం చాటుచేసుకు నిలబడింది.

ఫాతిమా సందేహిస్తూనే అన్నది: "ఎలా గుర్తు పడతావు బాబూ? నేను చూచిననాడు రెండేళ్ళ బిడ్డవు!"

సుమతి చెప్పింది. "మీ ఫాతిమా ఆంటీ ఈమె ధీరజ్! వారు కోడలూ మనుమడూ, పాకిస్తాన్ అల్లర్లకు వచ్చేశారు."

సుమతి మాటలు పూర్తికాకుండానే ధీరజ్ గౌరవ ప్రపత్తు లుట్టిపడే చూపులతో ఫాతిమా వద్దకు వెళ్ళి పాదాలంటి నమస్కారం చేశాడు. "అమ్మ మిమ్మల్ని తలచుకోని రోజువుండదు ఆంటీజీ. ఈ అల్లర్లవల్ల మరీ తఱచు మీ విషయమే అనుకొంటూ వుంటూన్నది" మీ రాకవల్ల అమ్మకు బెంగ తీరింది."

"చల్లగావుండు బిడ్డా, ఆ తల్లికి తగిన బిడ్డవు, తెలుసు ఇంత మంచి మనసులని! అందుకే వెదుక్కుంటూ వచ్చాను. పరిస్థితులు ఒకదారికి వచ్చేవరకూ మమ్మల్ని కాపాడగలరా బాబూ?"

"ఎంతమాట! ఈ యిల్లు మీది కాదా? అమ్మ నాకు ఏనాడో అన్నీ చెప్పారు. ఒకనాడు మాకు మీరు ప్రాణదానం చేశారు. ఈనాడు మీ కష్టాలలో మేము ఆదుకోవటం మానవ ధర్మమేకాదు. మా బాధ్యత, మా కర్తవ్యం! మాతోపాటే మీరూ. ఇది మీయిల్లే!"

సుమతి కనులూ, మనసూ గర్వంగా నాట్యమాడాయి కుమారుని ఔదార్యానికి. "అలా చెప్పు బాబూ. వచ్చిన దగ్గర్నుంచీ ఒకే గొడవ. మనమంతా ఒక కుటుంబంగా వున్న

వాళ్ళమే ఒకప్పుడు."

"ఔను."

"ఎన్నో కష్టాలుపడి వచ్చారట పాపం. నజీర్ పత్తా తెలియదట!"

"అయ్యో!"

"ఈమె రజియా. చిన్నప్పుడు సువ్వూ, రజియా, నజీర్ అంతా కలసి ఆడుకునేవాళ్ళు ధీరజ్, రజియా నీకంటె రెండేళ్ళు పెద్దదేమో! అంతే! నజీర్ రజియాల పెళ్ళికి మనకి ఆహ్వానంకూడా వచ్చింది ఆజ్మీర్‌లో వుండగా."

"ఔను, జ్ఞాపకం వుంది."

"దైవకృపవల్ల నజీర్ భయ్యా క్షేమంగానే వుంటాడు. మీరు ఏదిగులూ పెట్టుకోకుండా నిశ్చింతగా యిక్కడ వుండాలమ్మా. వింటున్నావా బాబీ! అంతా సర్దుకుంటుంది."

మౌనంగా నమస్కరించింది రజియా.

"వాళ్ళకు మనం ఎంతచేసినా ఋణం తీరదు ధీరజ్! పాపం, ఎంత మంచివాళ్ళు! ఎంత ఘనంగా బ్రతికినవాళ్ళు!" అన్నది సుమతి, కుమారునికి భోజనం పెడుతూ.

"ఔనమ్మా."

నీకన్నీ తెల్సు. నీ విషయంలో నాకేం సందేహం లేదు ధీరజ్. కాని......శైలు చాలా తొందరమనిషి. ఏమంటుందో ఎలా ప్రవర్తిస్తుందోనని భయంగా వున్నది."

"ఔను, కానీ అన్నీ వివరంగా చెప్తా. చిన్నపిల్లేం కాదుగా? తెల్సుకుంటుంది"

"ఏమో, నాకేం నమ్మకంలేదు."

సుమతి భయం నిజమే అయ్యింది.

"వారెవ్వా?" అమ్మా, ఎంత బాగా యిచ్చానను కున్నావ్ లెక్చర్. అంతా ఆశ్చర్యపోయారనుకో! చూస్కో— రేపు పేపర్లలో ఎంతెంత అక్షరాలతో పడ్తుందో నాగురించి, ఉబ్బి తబ్బిబ్బౌతూ, తనను తానే శ్లాఘించుకుంటూ చిన్న పిల్లలా గెంతుతూ వచ్చిన శైలజ ముఖం చిట్లించుకున్నది ఇంటవున్న క్రొత్త వ్యక్తులను చూచి!

"ఇటు రా శైలూ!" ఆమె ఏమి నోరు జారుతుందో నన్నభయంతో త్వరత్వరగా వెనక గదిలోనికి పిలుచుకు పోయింది సుమతి.

"ఎవళ్ళో దండెత్తినట్టున్నారే చుట్టాలు?" విసుగ్గా అడిగింది తల్లి అందిస్తూన్న కాఫీ తీసుకుంటూ.

"కాదు శైలూ. అలా మాట్లాడకు. నేను చెప్పేది కాస్త సావధానంగా విను."

"ఏమిటో?" శైలు కంఠంలో హేళన, "నీకంతా చుట్టాలూ, స్నేహితులూ, కావలసినవాళ్ళే! అందరూ నీ నెత్తినే ఎక్కుతారు."

"చిన్నపిల్లవు కాదు శైలూ." కోపంగా అదరిస్తున్నట్లు అన్నది సుమతి. "నీవు నీ మాటలలో నడవడికలలో చాలా జాగ్రత్తగా వుండాలి. ఎల్లకాలం ఒకటే తీరా."

"ఇంతకూ ఏమిటీ?" శైలజ విసుగుదలను ప్రదర్శించింది.

"అమ్మ చెప్పేది విను శైలూ. చాలా ముఖ్యవిష

యం. నీకెప్పుడూ వివరంగా చెప్పలేదు." ధీరజ్ గుమ్మంలో నిలబడి అన్నాడు.

తప్పనిసరిగా కూర్చున్నది శైలజ అయిష్టంగా. సుమతి ప్రారంభించింది.

హిందూదేశంలో రజాకార్ల దుండగాలు మితిమీరి చెలరేగిన రోజులలో హైద్రాబాద్‌లో ఒక సాయంత్రం.—

ఎవరో తలుపు టకటకా కొడ్తూంటే, సుమతి జడుస్తూ జడుస్తూ సందులలోనుంచి చూచింది. ఎవరో తెలియకుండా తలుపు తెఱచే పరిస్థితిలో లేదు నగరం. ఏ వీధిలో ఏసందులో చూచినా హిందూ ముస్లిం కొట్లాటలే! రక్తం ఏరులై ప్రవహించుతూన్నది. నిత్యం గుండెదడే. ఏ నిముషంలో ఏ స్త్రీ పరువు పోతుందో, ఏ యింటి దీప మారిపోతుందో తెలియకుండా వున్నది.

"ఓరి! నువ్వా నజీర్. ఎవరో అనుకున్నాన్రా!" నవ్వుతూ, తలుపు తెరచి చటుక్కున ఆరేళ్ళ నజీర్‌ను లోపలకు లాగి తిరిగి తలుపులు వేసేసింది.

పొరుగునున్న షేక్ సాహెబ్ కుమారుడు నజీర్. షేక్ ధనవంతుడు, సహృదయుడు.

సుమతి భర్త చంద్రశేఖరం పేరు ప్రఖ్యాతలు గల డాక్టర్.

చంద్రశేఖరమూ షేక్‌సాహెబ్ ప్రాణస్నేహితులు. ఫాతిమాబీ, సుమతీ అక్క చెల్లెండ్రకంటే ప్రాణంగా మెలిగేవారు. ఇళ్ళు వేరైనా ఇంచుమించు అధికభాగం అంతా ఒక యింట్లోనే గడిపేవారు. మతభేదం, మాత్సరమూ ఎరుగని

ప్రాణాధిక స్నేహం రెండు కుటుంబాల నడుమా.

ఆరేళ్ళ నజీర్, అయిదేళ్ళ రజియా, మూడేళ్ళ ధీరజ్; అయిదేళ్ళ శంకర్ ఎప్పుడూ కలిసి ఆడుకొనేవారు. రజియా షేక్‌జీకి దగ్గర బంధువు కుమార్తె. ప్రక్కవీధిలో వుండేది ఆ కుటుంబం.

"నజీర్ ఇక్కడే తిని నిద్రపోయాడు," అనేది సుమతి అడగవచ్చిన ఫాతిమాతో.

"శంకర్, నజీర్ ఎప్పుడో తినేసి నిద్రపోయారు. నువ్వు పడుకో. ప్రొద్దున వస్తాడులే" అనేది ఫాతిమా. మరోనాడు హిందూ ముస్లిం విద్వేషాలూ, కొట్లాటలూ విపరీతంగా చెలరేగిన పరిస్థితులలో కూడా ఆ రెండు కుటుంబాల ప్రాణ స్నేహం చెక్కుచెదరలేదు.

"అందరూ పిల్లలనూ, ఆడవాళ్ళనూ సురక్షిత గ్రామాలలోని బంధువుల యిండ్లకు పంపివేస్తున్నారు. నువ్వు కూడా అన్నీ సర్దుకో సుమతీ. పిల్లలూ నువ్వూ క్షేమంగా వుండాలి ఎక్కడో ఓ చోట. మీ పుట్టింటికి వెళ్ళిపో ప్రయాణం ఏర్పాట్లు చేస్తాను," అన్నాడు చంద్రశేఖరం ఎన్నోసార్లు.

సుమతి వినలేదు. "ఆ వెళ్ళేవాళ్ళంతా తమ తమ మగవారిని వాళ్ళ ఖర్మాల కొదిలేసి ఎలా వెళ్తున్నారో నాకు అర్థం కావటంలేదు. మిమ్మల్ని ఈ అల్లర్లలో వదిలి నేను నా దారి చూచుకోనా?"

"ఛ ఛ, అదికాదు సుమా. మగవాడికేముందీ, చటుక్కున్న ఎక్కడైనా పారిపోయి ప్రాణరక్షణ చేసుకోగలడు, మీ సంగతి అలా కాదుగా? ఎన్నెన్ని ఘోరాలు జరుగు

తున్నాయి! నా మాట విను. పిల్లల్ని తీసుకువెళ్ళిపో."

"మీరూ రండి. అందరం వెళ్ళిపోదాం. నన్ను మీనుంచి వేరుచేయకండి." వలవలా ఏడ్చింది, సుమతి.

"ప్చ్. ప్రభుత్వోద్యోగులం. చిక్కుకుపోయినట్లున్నది పరిస్థితి. మేం కదలటానికిలేదు.

"పోతేపోయింది ఉద్యోగం! ప్రాక్టీస్ పెట్టుకుందాం ఎక్కడైనా మన వేపున."

"అదంతా తర్వాత. ప్రస్తుతం అనుమతి వద్దూ ఉద్యోగం వదలటానికైనా? నా మాట విను." శతవిధాల నచ్చజెప్పాడు చంద్రశేఖరం.

మూర్ఖంగా పట్టుపట్టినా ఆఖరికి అంగీకరించింది సుమతి. రేపే ప్రయాణం.

అటు ఫాతిమా కూడా ఎంతో విచారంగా వున్నది ప్రాణసఖి కొంతకాలం వరకూ కన్పించదని.

అందుకే ఇప్పుడు నజీర్ కూడా వచ్చాడని మసుతి అనుకున్నది.

చేతులు వెనుకగా పెట్టుకున్నాడు నజీర్ వస్తువువేదో దాచిపెట్టినట్లుగా. ముఖం చాలా అప్రసన్నంగా క్రొత్తగా వున్నది. సుమతికి జాలీ, నవ్వుకూడా వచ్చాయి.

"ఏమిట్రా? వెళ్ళిపోతున్నా మనా అలాగున్నావ్? మళ్ళీ వస్తాంగా?" అన్నది నజీర్‌ను చేరదీసి చుబుకం పైకెత్తుతూ.

నజీర్ గింజుచుకొని దూరంగా జరిగాడు సుమతి చేతుల నుండి.

"ఏరీ శంకర్, ధీరజ్? ఇటివ్ ఆంటీ," అన్నాడు తీక్షణంగా.

సుమతి చకితురాలైనది అపూర్వమైన ఈ నజీర్ ధోరణి చూచి.

"ఏమిటీ? ప్రజంట్ తెచ్చావా వాళ్ళకి? పిలుస్తాను కానీ, ఏదీ, యేమిటో నాకు చూపు," అన్నది కుతూహలంగా, నజీర్ చేతులను ముందుకు లాగి.

"చూపను. వీల్లేదు." పెద్దవాడిలా పెనుగులాడాడు కానీ లాభం లేకపోయింది.

తళ తళ లాడుతూన్న చిన్న పదునైన కత్తి!

నిర్విణ్ణురాలైంది సుమతి. కొన్ని క్షణాలు ఆమె అలాగే మూఢురాలిలా చూడసాగింది.

"యేమిట్రా యిదీ?" అన్నది నిస్తేజంగా, "ఇదేమి బహుమతి నజీర్?"

"బహుమానం కాదు," కసిరి పారేశాడు నజీర్, "మీ హిందువులను ఎంతమందిని చంపితే మాకంత పుణ్యం వస్తుంది. నేనీరోజు ఎందరినైనా చంపుతాను," అటుగా వచ్చిన శంకర్‌పై దూకాడు.

కర్తవ్యం స్ఫురణకు తెచ్చుకొని వెంటనే ఒడిసి పట్టుకున్నది ఆ చేతిని సుమతి. లేకుంటే ఘోరం జరిగిపోయేదే! శంకర్ అంతా విస్మయంగా చూస్తున్నాడు.

"ఏమిటిది నజీర్? ఎవరు చెప్పారిది? "చేయి తన చేతిలో బిగించి పట్టుకొని అడిగింది సుమతి.

"ఎవరేమిటి? అందరూ అంటున్నారు. హిందువు అనే

వాడిని మేం బ్రతకనీయకూడదట. ఈ గల్లీలో గణేష్ రాంను ఆ రఫీ పొడిచేశాడు. ప్రక్క వీధిలో పటేల్‌నూ, సర్దార్‌నూ ఆ వీధిలో ముస్లింలంతా కలసి చంపేశారట. నేను శంకర్‌ను చంపేయాలి."

"భగవాన్! పాపపుణ్యాల భేదమూ, పాలూ నీరూ తేడాలూ తెలియని పసివారి హృదయాలను కూడా మలినం చేస్తున్నావా నీ లీలతో?" రోదించింది సుమతి మనసు.

"తప్పు నజీర్. చూడు, నువ్వెలా మనిషివో. శంకర్ కూడా అలాగే మనిషే. నిన్నెవరైనా కొడితే నువ్వేడుస్తావు కదూ?"

"ఔనూ?"

"అలాగే శంకర్ ఏడవడూ?"

నజీర్ తలగోక్కున్నాడు.

"తప్పు నజీర్, మనందరినీ ఒకే దేవుడు సృష్టించాడు. మనందరం ఒకటే. ఏదీ, శంకర్‌తో కరచాలనం చేయి!"

చేసి నవ్వుతూ వెళ్ళిపోయాడు నజీర్.

ఆ రాత్రి పదిగంటలకు వగర్చుకుంటూ వచ్చాడు చంద్రశేఖరం. "అబ్బ. ముందునుండీ వెళ్ళిపొమ్మంటే వెళ్ళనని మొండిపట్టు పట్టుకూర్చున్నావ్. ఇప్పుడు పరిస్థితులు విషమించిపోయాయి. ఈ తెల్లవారు ఝామున నీ ప్రయాణం సాగదు."

"ఏం, ఏమైంది? మీరేమి టలాగున్నారు?" అడిగింది సుమతి.

"ప్రాణాలెలా దక్కించుకొచ్చానో నాకే తెలియదు." గుండెలపై అరచేయి రాసుకుంటూ అన్నాడు. "నెత్తురు వరదలై ప్రవహిస్తూన్నది, ఈ ప్రక్క వీధిలోనే."

"అబ్బా, చెప్పకండి." చెవులు మూసు కున్నది సుమతి.

"ఇప్పుడేమిటి దారి ? ఎప్పుడు మన యింటిపై ఎవ రొచ్చి పడతారో తెలియదు. నీవు వట్టి మనిషివికూడా కాదు."

భయంతో యింతింత గుడ్లుచేసుకొని వెఱ్ఱిచూపులు చూస్తూన్న భర్తను చూచి సుమతికూడా చాలా ఖంగారు పడింది. ఎంత ఉపద్రవం కాకుంటే పురుషుడు అంత ఆందో ళనను ప్రదర్శిస్తాడు!

"ఏది దారి భగవాన్!"

ఎక్కడా ఎవ్వరూ నిలబడి నీరు త్రాగడం లేదు; కంటి నిండా నిద్రలు పోవడం లేదు.

ఆ రెండు రోజుల తర్వాత చంద్రశేఖరం ఊహించిన ఉపద్రవం రానేవచ్చిపడింది. సుమతి యింట దీపం నిలు స్తుందా? ఆరిపోతుందా?

అర్థరాత్రి యింటిమీదకు వచ్చిపడిన ముఠాను చూచి సుమతి స్పృహతప్పి పడిపోయింది. ఏమి జరిగినదీ ఆమెకు ఏమీ తెలియలేదు.

ఆమె కనులు తెఱచినది షేక్‌సాహెబ్ యింట.

చంద్రశేఖరాన్ని నరికి ముక్కలు చేయకుండా, సుమతి స్త్రీ గౌరవం పోకుండా—తన ప్రాణాలను అడ్డుపెట్టి కాపా

డాడు షేక్.

రెండు యిళ్ళకూ నడుమ పెరటిదారిన కున్నగోడ మాత్రమే అడ్డు.

ఆగోడమీదినుండి చంద్రశేఖరం అందించగా సుమతినీ పిల్లలనూ షేక్ అందుకున్నాడు. ఫాతిమా తమ లోపలి గదులలో దాచింది వారిని, కడుపులో పెట్టుకు కాపాడి నట్లుగా.

చంద్రశేఖరం యింటి నంతనూ చిందరవందర చేశాడు షేక్. కోడి రక్తంపోసి అక్కడక్కడా పులిమాడు. తాను గప్ చిప్ గా, తన యింటికి నిష్క్రమించాడు. పెరటి తలుపులు తీసేసి, ఏమి ఎరుగనట్లుగా తాను వీధిదారిన వచ్చి తమ జాతి సోదరులతో కలిసిపోయాడు.

అప్పటికి తలుపులు బ్రద్దలుగొట్టి లోపలికి ప్రవేశించ గలిగిన ముఠా, తిరగద్రోయబడి విరగగొట్టబడిన సామాను లతో, నెత్తురు మరకలతో వున్న యింటినీ, తెరవబడివున్న వెనుక తలుపులనూ చూచి అప్పటికే అక్కడ తమ సోదరు లెవరో కక్షతీర్చుకున్నారనీ, చావగా మిగిలిన వారు పెరటి త్రోవన ఎటో పారిపోయి వుంటారనీ నమ్మి, చేతకందిన వస్తువులను చిక్కించుకొని తృప్తిగా నిష్క్రమించారు. షేక్ ను ఎవ్వరూ అనుమానించలేదు.

ఈ సత్యం ఏ ఒక్కరికి బహిర్గతమైనా షేక్ కుటుం బమూ, వంశమూ నామ రూపాలు లేకుండా నశించవలసిందే. నమ్మక ద్రోహంగా, జాత్యవమానంగా నిర్ణయించి స్వజాతి జనులనడుమ ముక్క ముక్కలుగా నరికి కాకులకూ గ్రద్దలకూ

4969



ఎగురవేస్తారు. అతడి కుటుంబ స్త్రీల మాన మర్యాదలూ నిలువవు.

అయినా షేక్ సాహసించి ప్రాణాలకు తెగించాడు; స్నేహితునీ అతడి కుటుంబాన్నీ రక్షించాడు. ఇంటి నౌకర్లందరినీ మాన్పించేశాడు ఈ రహస్యం బయటికి పొక్కకుండా, ముందు జాగ్రత్తతో.

"మారణ హోమం చేయమని ఏ మతమూ కోరదు. దైవమూ రక్తపానం ఆశించదు. అయినా లోకం యిలా ఎందుకున్నదో నాకర్థం కాదు. అయితే అది వ్యక్తిగతాభిప్రాయం. నలుగురిలో ఈ అభిప్రాయాన్ని వ్యక్తీకరించే ధైర్యం లేదు." అన్నాడు షేక్.

సుమతి చంద్రశేఖరాలు చేతులెత్తి మొక్కారతడికి.

"పరిస్థితులు శాంతించేవరకూ యిలా మనం రహస్యంగా వుండాలి. ఏంచేస్తాం? కష్టకాలం! ఏమీ మొగమాటం వద్దు. ఇది మీ యిల్లుగానే భావించండి." అని మరీ మరీ చెప్తూ ఫాతిమా ఆ హిందూ కుటుంబాన్ని గుండెలలో దాచుకుంది.

"వెనుక నాకు స్నేహితురాలివే. ఇప్పుడు నాపాలిట అన్నపూర్ణవు ఫాతిమా. దీపం పెట్టి మొక్కుతాను రోజూ." అన్నది సుమతి.

షేక్ యింటనే శైలజ పుట్టింది నెలలు పూర్తి కాక మునుపే. అవసర పరిచర్య అంతా ఫాతిమాయే చేసింది కన్నతల్లివలె.

తర్వాత షేక్ కుటుంబం పాకిస్తాన్ తరలిపోయారు. రజియా కుటుంబం కూడా ఢాకా వెళ్ళిపోయారు.

చాలాకాలం ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగేవి.

నజీర్ లాయర్‌గా పేరుమోశాడు రజియాతో అతడి వివాహమైంది.

అక్కడ షేక్, ఇక్కడ చంద్రశేఖరంల నిర్యాణానంతరం అంతగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరగకున్నా ఆగిపోవటం మాత్రం జరగలేదు. అప్పుడప్పుడు ఫాతిమా, సుమతీలు ఉత్తరాలు వ్రాసుకుంటూనే వుంటారు. ఫాతిమాకు తెలుగుభాష బాగావచ్చు. సుమతికి హిందీ తెలుసును.

అంతావిన్న శైలజ తీరులో పెద్దమార్పు ఏమీ కన్పట్టంలేదు.

"అంతే? ఎప్పుడో ఏదో జరిగింది. అయిపోయింది. బ్రతకాల్సి వున్నది గనుక బ్రతికాం. అంతే. విశ్వాసం, గిశ్వాసం అని పెట్టుకూర్చుంటే ఇహ అయినట్లే మనపని!" అన్నది ముఖం చిట్లించుకుంటూ.

నివ్వెరపోయిన సుమతి, "ఎంత నిర్దయగా మాట్లాడుతున్నావ్ శైలూ?" అని మాత్రం అనగల్గింది.

"లేకపోతే ఏమిటమ్మా? ఏదైనా తోచింది యిచ్చి పొమ్మను, అంతేకాని బొత్తిగా మన చీరలు కట్టబెట్టి మన మంచాలపై పరుండబెట్టావా? ఇదేం బాగులేదు నాకు!"

"శైలూ!" అంతవరకూ మౌనంగా వున్న ధీరజ్ కల్పించుకున్నాడు. శైలూ, నీ అమూల్యాభిప్రాయం అవ

సరంలేదు. అమ్మకు వారు దైవసమానులు. నాకూముఖ్యులే. ఇక్కడే వుంటారు. నువ్వేమీ అగౌరవపరచటానికి మాత్రం వీల్లేదు." ఖచ్చితంగా అనేసి నిష్క్రమించాడు. శైలజ ముఖాన్నీ తీరునూ పరిశీలించకుండానే.

బలవంతంగా కోపాన్నీ, ఉక్రోషాన్నీ అణచుకున్నది శైలు.

ఫాతిమాకు భాష రావడం సుమతికి మరీ ప్రాణసంకటంగా వున్నది! తొందరపాటు స్వభావంకల శైలజ ఎందుకో ఒకందుకు విసుక్కోక మానదు. ఎప్పుడూ ధుమ ధుమ లాడుతూనే వుంటుంది. 'దిక్కుమాలిన గోల 'దరిద్రపు సజ్జ' వంటి మాటలు విసుర్తూనే వుంటుంది.

శైలజ ముఖం చూచే, భాష రాకున్నా రజియా గ్రహించగలిగింది ఆమెకు ఆ యింట తమ ఉనికి ఏమాత్రమూ అంగీకారంగా లేదని.

మెల్లగా ఆ కుటుంబంలో తామూ సభ్యులుగా కలిసిపోయారు రజియా ఫాతిమా. ఏదో ఓపని చేస్తూ ఎల్లప్పుడూ సుమతికి సాయంచేస్తూనే వుంటారు/ సుమతి ఎంత వారించినా వినక.

"మనపనులుమనం చేసుకోవడం తప్పేమిటి?"అంటుంది ఫాతిమా. నిజానికి ఆమెకుగాని; కోడలికిగానీ ఏ పనులూ రావు. నౌకర్లతో చేయించుకోవడమే తెలుసు వారికి. అయినా పరాయి యింట కూర్చుని ఊరగా తినడానికి సిగ్గిలిపోతున్నారు. వేరే దారిలేదు.

వారలా కలసిపోయి, కలసి మెలసి పనులు చేస్తూండడం

సుమతికీ, ధీరజ్‌కూ చాలా సంతోషప్రదంగా వున్నది. ఆ అత్తా కోడండ్రతోపాటు ఆ తల్లీ కుమారులుకూడ నిత్యం భగవత్ప్రార్థన కావించుతూనే వున్నారు ఆ సంసారం తిరిగి కుదురుకోవాలని.

కృత్రిమాలంకరణతో, సౌందర్య సాధనలతో తంటాలు పడే శైలకు అపూర్వ సౌందర్యవతి అయిన రజియాను చూస్తే అసూయ. నిత్యచింతామగ్నురాలైన రజియాకు అలంకరణపై ఆసక్తి నశించి ఏనాడో అయ్యింది. పనులన్నీ అయినతర్వాత స్నానంచేసి ఓ సాదాచీర కట్టుకుంటుంది. సుమతి యిచ్చిన నాల్గు చీరలూ మార్చి మార్చి కడుతుంది. ఆమె అంత నిరాడంబరంగా వుండటం, అంతటి అతి సామాన్య దుస్తులలో కూడా చంద్రబింబంవలె మెరసిపోవడం శైలజకు చెప్పరాని బాధగా పరిణమించింది. ఇద్దరుబిడ్డల తల్లికి యింత అందమా?

అహమ్మద్‌ను ఒకనాడు రెండు అంటించింది వీపుమీద తన గోళ్ళరంగు సీసాను బ్రద్దలుకొట్టాడని.

రజియా మనస్సేమో గాని, పైకి మాత్రం తీవ్రంగా కోప్పడింది కుమారుని. శైలజను క్షమాపణలు వేడింది.

"దిక్కుమాలిన భాష నాకేమైనా అర్థమౌతుందా, ఛస్తుందా?" కసిరిపారేసింది శైలజ క్షమాపణ కోరుతున్న రజియాను.

సుమతి బాధపడటం మినహా ఏమీ చేయలేకపోయింది. మరొకనాడు వేకువనే లేచివచ్చి వరండాలో నిలబడిన శైలజకు కూరపాదులకు ఏదో సంరక్షణ చేస్తూన్న రజియా అద్దే

పనిగా కనులు తుడుచుకోవడం గమనించింది.

ఆరోజు వారి పండుగదినం కావడాన ఆమెను ఏవేవో జ్ఞాపకాలు కలతపెడ్తున్నాయి. సుమతి వారిని ప్రాణసమంగా చూచినప్పటికీ ఆమె భర్తలేని లోటును ఎలా విస్మరింప గలదు? అది ఎవరు భర్తీచేయగల రీ బాధ? తన యిల్లూ తన సంసారం, తన వైభవం అన్నీ కలలేనా? నీటి అలలేనా? లేక నిజమై మఱల తనను ఆహ్వానించి ఆదుకుంటాయా? పతికి దూరమైన పడతి బాధ అనుభవజ్ఞులకే విశదం.

తన బాధలో, తలపోతలలో పూర్తిగా పరిసరాలనే విస్మరించిన రజియా శైలజ తనను పరీక్షగా గమనిస్తున్న విషయం పరికించనే లేదు.

"ఛీఛీ, దరిద్రపుగోల ప్రొద్దున్నే ఏడుపుముఖాల సందర్శనం!" కుర్చీని దభాలున తన్నుకొని లేచిపోయింది శైలజ.

ఉలికిపడి చూచింది రజియా.

తాను మనసారా ఏడవటానికి కూడా స్వతంత్రం లేదని గ్రహించిన రజియా విషణ్నురాలై శైలజ నిష్క్రమించిన దెసగానే వెఱ్ఱిదానివలె చూస్తూండిపోయింది. తలపై చెదరిపోయిన ముసుగును సరిజేసుకొనవలెనని కూడా ఆమెకు తెలియలేదు.

శైలజ గొణుగుడునూ, కుర్చీ శబ్దాన్నీ తనగదిలోనుండి విన్న ధీరజ్ కారణం ఊహించుతూ కిటికిలోనుండి బయటకు చూచాడు!

విద్యుల్లతను చూచినట్లే జిగేలుమన్నాయి అతడి కనులు. తనను చూస్తూనే దూర దూరంగా తొలగిపోతూం

టుంది రజియా, అదికాక ఎల్లప్పుడూ ముసుగు సరిజేసుకొంటూ వుంటుంది. అందువల్ల ధీరజ్‌కు ఆమెను సరిగా చూచే అవకాశమే కలగలేదు.

నేడా అవకాశం కలిగిన ధీరజ్ విస్మయ విభ్రాంతులతో విచలితుడయ్యాడు. ముస్లిం స్త్రీల సౌందర్యం గురించి అతడు విని వున్నాడు. కానీ......మరీ యింతటి అతిలోక సౌందర్యాన్ని కళ్ళారా చూడగలిగిన సుదినం మాత్రం యిదే!

అంతటి సౌందర్యవతినీ, వినయమూర్తినీ భార్యగా బడయగలిగిన నజీర్ ఎంత ధన్యుడు! బాల్యమిత్రుడు తలంపున మెదలగానే మరల అతడి మనస్సు విషణ్ణమైంది. 'నజీర్ క్షేమంగావుండాలి. అప్పుడే ఈ సౌందర్యరాశి ముఖబింబములో నవ్వునూ, తేజస్సునూ చూడగలం" అనుకున్నాడు.

"ఛ, తప్పు. ఈ రోజు నాకేమైంది? ఆమె అందాన్ని గూర్చిన యోచనే నా మనసున మెదలరాదు, బలవంతంగా ఆలోచనలను మళ్ళించ ప్రారంభించాడు ధీరజ్. కాని ఆరోజు నుండీ కూడ రజియా సుందరవదనాన్ని అవకాశం దొరికితే మరీ మరీ చూడాలని తహ తహ లాడేవాడు.

"అందాన్ని ఆరాధించడం తప్పుకాదు." తనకు తానే సర్ది చెప్పుకొన్నాడు.

"శైలూ, శైలూ!" నాజూకు కంఠాలతో వంకరలు పోతూ పిలుస్తూ బిలబిలా ప్రవేశించారు డజనుమంది స్త్రీలు, నవనాగరిక వేషాలతో. పాతికేళ్ళ యువతీ, యాభై యేళ్ళ పడతీ కూడ ఒకే విధంగా అలంకరించుకున్నారు. చూపరు

లకు వెగటుపుట్టేంత అధికంగా అతిశయంగా!

"ఏమిటింకా యిలాగున్నావ్, తయారవ్వకుండా? మఱచిపోయావేమిటి మన ప్రోగ్రాం?" ఒక వన్నెలాడి ప్రశ్నించింది.

"లేదనుకో, కానీ..." శైలజ నసిగింది.

"ఏమిటి కానీ? మీ ఆయన గుర్తుకు వచ్చారా ఏమిటి?" ఒక ప్రౌఢ మాట విసురుతూ, అదేదో గొప్ప హాస్యంగా ఒళ్ళంతా కదుపుకుంటూ నవ్వింది. వచ్చిన అందరూ శ్రుతి కలిపారు.

"ఆఁ. అంతగా మొగుడికోసం బెంగలు పెట్టుకు చచ్చే పాతచింతకాయ పచ్చడి లెవరూ లేరులే మన క్లబ్బులో." అతిశయంగా అన్నది ఓ ముసలి యింజనీరుగారి పడుచు భార్య.

మళ్ళీ ఈ మాటలకు పకపకలు చెలరేగుతూన్న సమయంలో ధీరజ్ లోపల అడుగు పెట్టాడు. వెంట అహ్మద్ కూడా వున్నాడు.

ఒక్కసారిగా అందరిదృష్టి అటు తిరిగింది.

"ఓ! సుదినం. ఈరోజు మీ దర్శనం అయ్యింది." ఒకామె హఠాత్తుగా కుర్చీనుండి లేచి, ధీరజ్ చేతులలోవున్న అహ్మద్ బుగ్గలను మరీ మరీ ముద్దుపెట్టుకొంటూ "ఎంత బాగున్నాడు! ఎవరీ అబ్బాయి?" అనడిగింది ధీరజ్ కనుల లోనికి అదోకలా చూస్తూ.

మదవతులు తమ వెఱ్ఱికోరికలను యిలా పిల్లలను అడ్డం [illegible]కొని వ్యక్తీకరిస్తారని ధీరజ్ కు తెలుసు.

"మా బంధువులు." ముక్తసరిగాఅనేసి సాగిపోయాడు. అయితే అంత తేలికగా కదలనిచ్చే రకంకాదు అక్కడ చేరిన ఎవరూకూడ. పురుషులను వేటాడ్డం వెంటబడడం హాబీ అయిన ఒకామె ముందుకువచ్చి, "మాక్లబ్ ఎసోసియేషన్‌కు ఎన్నిసార్లు పిలచినా తప్పించుకుపోతున్నారు. మీకంత తేలిక భావం ఎందుకు మాపై?" అనడిగింది నిలదీసినట్లే.

"ఔను. చెప్పండి, వదలం మిమ్మల్ని." పిల్లల్లా గారాలుపోతూ అందరూ చుట్టుముట్టారు ధీరజ్‌ను.

ఆ క్షణంలో ఆ దృశ్యం చూచిన ఎవరైనా అది సంసారపక్షపువారి సమావేశం అని నమ్మడం కష్టం. ఎవరి మట్టుకు వాళ్ళకే అతడికి చేరువగా నిలబడి ఆకర్షించుతూ మాట్లాడాలన్న తాపత్రయమే. తాము స్త్రీలమనిగానీ, చీర చెరగులు తమ తమ స్థానాలలో వున్నవో లేదో అనే జాగ్రత్తలుగానీ, పురుషునితో మాట్లాడే సమయాన కొన్ని కొన్ని హద్దులను పాటించవలెననే సదాచారంకానీ ఎవ్వరికీ గుర్తున్నట్లే లేదు.

ఎలాగో వారిని వదిలించుకుని లోపలకు వచ్చిన ధీరజ్‌కు వంటయింట్లో రజియా కాఫీకలిపి కప్పులు నింపుతూ కన్పించింది. ఫాతిమా మరేదో పనిచేస్తూన్నది.

సుమతికొఠకు అటుగా వెళ్ళిన ధీరజ్ వెనక్కు వచ్చేస్తూంటే "అమ్మకు జ్వరంబాబూ." అని చెప్పింది ఫాతిమా.

"అరే!" ఖంగారుపడుతూ తల్లి గదిలోకి వెళ్ళాడు ధీరజ్.

"మామూలు జ్వరమే, కంగారులేదు" నవ్వుతూనే అన్నది సుమతి. "పాపం రజియా పనంతా చేస్తూన్నది."

తల్లిపక్కలో కూర్చుంటూ ధీరజ్, అంతలో వంటింటి నుండి శైలజకంఠం గట్టిగా వినరావడంతో లేచి వెళ్ళాడు.

"ఆ వెధవను కాస్త నీదగ్గర అట్టేపెట్టుకో, మరీ వచ్చిన వాళ్ళందరి దగ్గరా కూర్చుంటూ వాళ్ళ హాండ్ బ్యాగ్ లవీ సర్దుతున్నాడు, బొత్తిగా మేనర్స్ లేదుగాడిదకు." శైలజ అరుస్తోంది ఫాతిమా రజియాలపై.

అర్థంకాని రజియా దీనంగా చూడసాగి ది.

ఫాతిమా "అలాగేనమ్మా - నేను చూడలేదు." అని వినయంగా చెప్తూన్నది.

"కాఫీ మరో రెండుకప్పులు కావాలి." ఆజ్ఞాపించింది శైలఝ.

"అయ్యో! పాలు అయిపోయినాయే!" ఫాతిమా అన్నది.

శైలజకు కోపం వచ్చేసింది. "ఔనుఁ అయిపోక ఎందుకుంటాయి ఏవిమాత్రం - తేరమూకలు యింటిపై పడ్డాక?"

విసురుగా అనేసిన శైలజ వెనుదిరుగుతూనే ధీరజ్ ను చూచి గతుక్కుమన్నది. అంతలోనే సర్దుకొని ఏమీ జరగనట్లే, "చూడు ఆంటీ, రజియాను ఒక్కసారి అట్లాతీసుకురా. మా వాళ్ళు చూస్తారట" అన్నది.

"ఎందుకూ?" ధీరజ్, ఫాతిమా ఒకేసారి అడిగారు.

అంతలో హాల్లోనుంచి ఆలస్యం భరించలేనట్లుగా ఓ కంఠం అరవటం విన్పించింది. "ఏదీ- మీ బాంగ్లాదేశ్ శర

ణార్థినిని యింట్లో పిలవ్వోయ్ శైలూ, చూస్తాం కళ్ళారా!"

అర్థమైంది ధీరజ్‌కు, "ఏమిటి వాళ్ళంతా ఆమెను చూచేది? ఎందుకూ? ఏం ఉద్ధరిస్తారు?" అన్నాడు శైలతో తీక్షణంగా.

"ఏం, నువ్వు వెనకేసుకొస్తున్నా వేమిటి కథ?" శైలజ కంఠంలో వెటకారం కనులలో క్రోధం.

"ఎందుకులే తల్లీ ఏం చూస్తారు? అసలే సగంచచ్చి వున్నదది కుమిలిపోతూ, అలా అందరిలో తిరిగే ధైర్యవంతురాలు కాదు కూడా." అన్నది ఫాతిమా.

శైలజ కయ్యిమన్నది. "అబ్బో ఎంతెంత అభిమానాలు! వాళ్ళంతా ఆడవాళ్ళే! ఎవళ్ళో చేసినట్లుగా కొరుక్కు తినేవాళ్ళేం లేరక్కడ" అంటూ విసవిసా వెళ్ళిపోయింది.

ఏమీ లెఖ్ఖచేసుకోని ఫాతిమా కనులలో కూడా నీరు గిర్రున తిరగడం స్పష్టంగా కన్పించింది ధీరజ్‌కు.

"ఏం, రానందా బూబమ్మా?" ఒక టక్కులాడి పళ్ళన్నీ బయటపెట్టి అడగడం, శైలజ విసుగు లగా 'పోనిద్దూ బ్రూట్, చూచేదేమిటి?" అనడం ధీరజ్ స్పష్టంగా విన్నాడు.

"ఇంతకూ... ఎన్ని అనుభవాలయ్యాక యిక్కడికి జేరిందో? ఇంకా ఘోషా ఏమిటి, నటన?" ఒకావిడి వ్యాఖ్యానం.

"అన్నట్టు...... నువ్వు వంటింట్లో మాట్లాడి వస్తున్నావ్. ఈ కాఫీ ఆవిడే చేసిందా శైలూ? నిజంచెప్పు." తాగుతున్న కాఫీ గొంతుదిగనట్టుగా ముఖం వికృతంగాపెట్టి

కప్పు క్రింద పెట్టేసింది ఒకామె.

టక టకా పన్నెడు కప్పులూ బల్లమీదకు చేరి పోయాయి.

"ఆఁ. ఆమేచేసింది. ఇంట్లోపనులన్నీ చేస్తారు. ఊరికే కూర్చోపెట్టి మేపుతామా ఏం?" శైలజ సమాధానం.

"ఛూత్."

ఉమ్ముతూ లేచి పోయింది మొదట అడిగినామె. అందరూ ఆమె ననుసరించారు. "ఎంత ఆధునికమైతే మాత్రం మరీ జాతిభ్రష్టం చేసుకుంటామా, నానా మైలకూడూ తిని? చాల్లే, మర్యాద, పోదాం పదండే. ఆమెకు ఆ పట్టణంలోనే గాక ఇతర నగర వాస్తవ్యులైన వారితో కూడ ఎన్నెన్ని జాతులవారిలో స్నేహసంబంధాలున్నాయో అందరికీ తెల్సు. అయినా నటన బాగావచ్చు."

బిలబిల లాడుతూ వెళ్ళిపోయారు.

నిజంగా అదంతా కృతకమనీ, తాము పిలిచిందే చాలన్నట్లుగా రజియావచ్చి ఎదుట నిలబడి నిర్దయ నిందా భూషణ వాక్యాలను విని హేళనగా దృష్టులను భరించలేదనే అక్కసుతోనే వారలా నిరసన వెలిబుచ్చారనీ శైలజకు తెలుసు. అయినప్పటికీ ఉగ్రకాళిలా వెళ్ళింది తల్లి గదిలోకి.

"చూశావా ఎంతవమానం జరిగిందో?" అన్నది బుసలుకొడుతూ, "స్నేహితులే యిలాగంటే ఇక అయినవాళ్ళంతా ఏమంటారు?"

"ఎవరా అయినవాళ్ళు?" అక్కడే అహ్మద్‌తో, కీ రైలుతో ఆడుకుంటూన్న ధీరజ్ ఎదురు ప్రశ్నించాడు.

"బంధువులూ, చుట్టాలూ......"

పోనీ, నీకంత భయంగా వుంటే మీ యింటికి నువ్వు వెళ్ళిపోరాదూ? నీ జాతి పోకుండా భద్రంగా వుంటుందీ?"

"చూశావామ్మా?" అంతకంటే ఏమనాలో తెలియని శైలజ ఏడుపుముఖంతో తల్లికి ఫిర్యాదుచేసింది.

"ఛీ, ఏమిటి ధీరజ్ ఆ మాటలు? ఇంటికి వచ్చిన ఆడ పిల్లను వెళ్ళమని చెప్పడమా? నీకుకూడా ఇంతనోరు జారుడు ఎప్పట్నించీ?" మందలింపుగా అన్నది సుమతి.

"మరి ఏమిటమ్మా? ఏమిటీ లేనిపోని గొడవ? అనాలని అన్నానా నేను మాత్రం?"

"చాల్లెండి, ఊరుకోండి." ఇద్దర్నీ మందలించింది.

## 6

"శ్రమలాగే ఎవరియింటనో ఏశరణార్థుల కేంపులలోనో నజీర్ బ్రతికే వుంటారని రజియా ఫాతిమాల నమ్మిక. "అతడు క్షేమంగా వుండాలి. అతడు క్షేమంగా వుండాలి." అహో రాత్రులూ అదే జపం రజియాకు.

"కేంపులోని విశేషాలూ వార్తలూ సేకరించడానికి వెళ్ళిన మా రిపోర్టర్లందరికీ యిచ్చాను నజీర్ వివరాలు. ఎల్లుండి మా పత్రిక తరఫున బాంగ్లాదేశ్ వెళ్తూన్నవారిలో నేనూ వుంటాను, తప్పకుండా అక్కడకూడ చూసివస్తాను." అంటూ నజీర్ గురించి పూర్తి వివరాలూ, అడ్రసూ అన్నీ తీసుకున్నాడు ధీరజ్, ఫాతిమావద్ద.

అతడి రాక కొరకై వేయి కనులతో ఎదురు తెన్నులు చూస్తూన్నది రజియా.

"ఎన్ని ఎన్ని! ఎన్ని నెలలై పోయాయి తామిక్కడకు జేరి! ఏమిటో అంతా కలగా లేదూ? ఎక్కడి ఎక్కడి మేము, ఎక్కడ మీరు? కానీయ్. జరిగిందేదో జరిగిపోయింది. ఇక నైనా నాయింటికి నన్నూ బిడ్డనూ అత్తనూ జేర్చు అల్లా, ప్రార్థన సలుపుతూన్నది.

భగవంతుడు ఈ మొర వింటాడా?

నిత్యం వీథిద్వారం దెసనే వుంటున్నాయి ఆమె చూపులు ధీరజ్ రాకనూ అతడు తెచ్చే వార్తనూ నిరీక్షిస్తూ.

"నా దగ్గర బిడ్డ అహ్మద్ వున్నాడు. అత్త ఫాతిమా వున్నది. కనీసం కొంతలో కొంత మనశ్శాంతి యిది. కానీ ఆయన......ఆయన ఒక్కరూ పాపం ఏకాకియై ఎంత దుర పిల్లుతున్నాడో! ఏంతటి మనః క్షోభకు గురి ఔతున్నాడో కదా! చిన్న బిడ్డను ఆ నిర్దయులు చంపేశారని తెలిసి గుండె లవిసేలా ఏడవడూ? ఎలా సమాధాన పెట్టాలి అతడిని?" నిత్యం యిదే చింత.

# 7

తల వాల్చుకొని నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ నీరసంగా వస్తూన్న ధీరజ్‌ను ఎవరికి వారే విపరీ

తంగా కలవరపడ్డారు.

"ఏమిటి ధీరజ్? జ్వరపడ్డావా?" సుమతి ఆత్రుతగా అడిగింది. 'లే' దన్నట్లు తలాడిస్తూ, నీరసంగా కుర్చీలో కూల బడ్డాడు.

"నజీర్ విషయం తెలియలేదా?" రహస్యం అడిగి నట్లుగా అడిగింది దగ్గరగా నిలబడి.

"తెలిసిందనుకో?" అనలేక అన్నాడు.

ఆ ధోరణి చూచిన సుమతి గుండె ఒక్కసారి వేగంగా కొట్టుకొనసాగింది. "నజీర్ మరణించాడా? లేక అవిటివా డయ్యాడా?"

వివరం అడిగి వినగల ధైర్యం లేక అలాగే నిలబడి చూడసాగింది.

ధీరజ్ వచ్చాడు, ఏమైనా చెప్తాడని కొండంత ఆశతో ఫాతిమా, రజియాలు కూడా వచ్చి నిలబడ్డారు. ఎన్నడూ లేని అలవాటుగా ఈ రోజు రజియా ధీరజ్ ఎదుట నిలబడింది దీనమైన చూపులతో.

ఆ కనులలోని ఆశను హతమార్చే వార్తను నోటితో చెప్పలేని ధీరజ్ నేలచూపులు చూడసాగాడు.

అతడి తీరులోనే అశుభాన్ని ఊహించిన ఫాతిమా రజి యాల కనులు గండిపడిన చెరువులే అయ్యాయి.

"నా బిడ్డ ...... నా నజీర్ చనిపోయాడా?" వణుకు తూన్న పెదవులతో, పూడిపోయిన కంఠాన్ని ఎలాగో పెగు ల్చుకుని అడిగింది ఫాతిమా.

"లేదు, నిక్షేపంలా వున్నాడు." ధీరజ్ సమాధానం, "ఇదిగో ఈ ఉత్తరం మీకిమ్మన్నాడు." అని బ్యాగ్‌లోని కవరుతీసి ఆమెకందించి తిరిగి తల పట్టుకూర్చున్నాడు.

"తాము విన్నది నిజమేనా?" అన్నట్లు శ్రోతలు ముగ్గురూ ఒకరిముఖంలోకరు ఆశ్చర్యంగా చూచుకున్నారు.

మరి ధీరజ్ అలాగెందుకున్నట్లు?

"బాబూ, నీ తండ్రి బ్రతికేవున్నాడురా! ఇక మనం ఏడవక్కర్లేదు." ఫాతిమా మనుమడిని కౌగలించుకొని ముద్దులు కురిపించుతూ ఉత్తరం చదవమన్నది కోడలిని.

రజియా ముఖంలోని నూతన కాంతినీ, ప్రఫుల్లతనూ చూచి సుమతీ ధీరజ్‌లు అచ్చెరువందారు. ఇక్కడకు వచ్చిన తర్వాత ఏనాడూ ఆమె వదనం అలాగలేదు.

అల్లాను స్మరించుకుంటూ లేఖ విప్పి చదివిన రజియా ముఖం అంతలో కళలు తరిగిపోయి వెలవెలబోయి వెర్రిగా అందరిదెసా చూడసాగింది. లేఖ చేతులలోనుండి జారి క్రింద పడిపోయింది. హఠాత్తుగా రెండుచేతులలో ముఖం కప్పుకొని హృదయ విదారకంగా ఏడ్వసాగింది.

"ఏమిటి? ఏమిటి?" సుమతీ, ఫాతిమా ఆత్రంగా ప్రశ్నించారు.

ఫాతిమా తీసుకు చదివింది ఆ లేఖను.

చదువుతూనే ఆమె ముఖం కోపంతో అసహ్యంతో నిండిపోయింది. "ఛీ," ఉత్తరం నేలకు విసరికొట్టింది.

"ఏవరు? నజీర్ రాశాడా?" సుమతి అడిగింది.

"ఆ. నా ఎదుటే వ్రాసిచ్చాడు." ధీరజ్ సమాధానం.

"ఔను. ఆ నీచుడి వ్రాతే అది." ఫాతిమా ఉగ్ర కాళియై ఊగిపోతున్నది. "నా కడుపున చెడబుట్టాడు. ఇంత కంటే వీడు చచ్చాడన్న వార్త వింటే సంతోషించుదునేమో!" నిగ్రహించుకోలేక ఆమెకూడా రోదించసాగింది. రోదించుతూనే మధ్య మధ్య సుమతికి విషయ వివరణ కావించింది.

"ఫాతిమా,—అహ్మద్‌లు మాత్రమే యింటికి తిరిగి రావలసిదిగా—అందుకు తగిన ఏర్పాట్లు చేస్తాననీ వ్రాశాడు నజీర్. "చెడిపోయినది నాకక్కరలేదు." అదసలు యింకా ఎందుకు బ్రతికున్నది యింత విషం మ్రింగి చావక? లోకులకు ముఖం చూపగల సిగ్గుమాలినతనం దానికి వున్నా, దాన్ని తెచ్చి యింట పెట్టుకు ఏలుకోవలసిన అక్కరా, సిగ్గుమాలినతనం నాకులేవు. దానిని తెచ్చుకొని సంఘంలో నా పరువు గౌరవాలు నాశనం చేసుకోలేను. నేను మరలా వివాహం చేసుకున్నాను. ఈ లేఖనే 'తలాక్' (విడాకులు)గా భావించి రజియా తన యిష్టానుసారం ఎక్కడికైనా పోవచ్చు. నా యింటమాత్రం అడుగుపెట్టటానికి వీల్లేదు, కావాలంటే అహ్మద్‌నుకూడా దానితోనే వుంచుకోమను. నాకేమీ అభ్యంతరం లేదు."

ఇదీ నజీర్ లేఖలోని సారాంశం, అతడింకా చాలా చాలా వ్రాశాడు రజియాను నిరశిస్తూ. అతడానాడు పారిపోయి ప్రచ్ఛన్నంగా అక్కడే దాగివుండి, గొడవలు జరిగిన తర్వాత యింటికి తిరిగి జేరుకున్నాడు.

రజియా అలానే నేలనపడి ఏడుస్తూన్నది.

తల్లిని చూచి కొడుకు ఏడుస్తున్నాడు.

సుమతి కూడా మౌనంగా రోదిస్తూ, రజియాను ఒడిలోనికి తీసుకున్నది. అయితే, ఎవరు ఓదార్చకల బాధ అది? దానికి ఉపశమనం వున్నదా?

"రజియా ఏం పాపం చేసింది దానిని త్యజించటానికి? తాను బుద్ధిపూర్వకంగా చెడిపోయిందా? ఈ పౌరుషం ఆనాడేమైంది? దుండగుల నడుమ నిస్సహాయంగా వదిలేసి తన మట్టుకు తాను పారిపోయి ప్రాణం రక్షించుకున్నాడు పిరికిపంద. భార్య పవిత్రతను కాపాడుకోనవ్వని అశక్తుడు, భార్యాబిడ్డలు ఎక్కడ కుమిలిపోతున్నారో పత్తాకూడ తెలుసుకోకుండా మరొక తెను కట్టుకు కులుకుతున్నాడు? వాడూ మనిషేనా?" అలసి పోయేవరకూ తిడుతూనే వున్నది ఫాతిమా.

భీకర ప్రళయానంతరపు భయంకర ప్రశాంతత ఆవరించింది యింటిని. ఎవ్వరూ భోజనాలు చేయలేదు.

శైలజమాత్రం తనకు తాను పెట్టుకుతిని ఊళ్ళోకి వెళ్ళిపోయింది ఈ శుభవార్త అందరికీ చాటించటానికి.

"ఆఫీసుకు వెళ్ళి సాయంత్రం వస్తానమ్మా. కొంచెం కనిపెట్టిచూడు; పాపం. ఏ అఘాయిత్యమైనా చేస్తుందేమో?" ధీరజ్ తల్లితో అన్నాడు.

"ఇక ఏది దాం? ఆ పిల్ల ఏమైపోతుంది?" సుమతి అడిగింది జాలిగా. "అనాధాశ్రమాల పాలుకావలసినదేనా?"

"ఏమోనమ్మా. ఏమిటో అంతా అయోమయంగా వున్నది."

# 8

అర్థరాత్రి నిశ్శబ్దంలో మెల్లగా గడప దాటుతూన్న రజియాను బలమైన హస్తం పట్టి ఆపింది. రజియా నెమ్మదిగా ఏడుస్తూ వదలమనీ, తనను పోనిమ్మనీ ప్రాధేయపడుతున్నది.

సందడీ మాటలూ విని సుమతీ ఫాతిమాలు లేచి పరుగున వచ్చారు.

"ఇంకా చదువుకుంటూ మేలుకొని వున్నాను గనుక సరిపోయింది. లేకుంటే ఎంత ఘోరమైనా జరిగేది." అన్నాడు రజియాను సుమతికి ఒప్పగిస్తూ ధీరజ్.

"ఏమిటి చచ్చిపోవాలని పారిపోతున్నావా?" ఫాతిమా కన్నీళ్ళతో అడిగింది కోడలిని.

"ఇంక నాకు వేరు దారేముంది? నీకొడుకు దగ్గరకు నీవు వెళ్ళిపోతావ్. నేను... నేను ఏమవ్వాలి? నాకేదిదారి?" గుండెలోని రంపపు కోతను భరించలేనట్లుగా రజియా గోడకు తల బాదుకుంటూ, గుండెలు సవరించుకుంటూ రోదించ సాగింది.

వింటూనే ఫాతిమా ఛీత్కరిస్తూ అన్నది. "ఛీ, నా కొడుకు ఎక్కడున్నాడు? నన్నూ నా కోడలినీ రాక్షసుల కిరాతకాలకు నిర్దాక్షిణ్యంగా వదలిననాడే వాడు చచ్చిన వాళ్ళలో జమఅయ్యాడు. బుద్ధిలేక నేనే ఇన్నాళ్ళూ వెఱ్ఱి

భ్రమలో వుండి ఎదురుచూచాను... రజియా! నిన్ను వదలి నా దారి నేను చూచుకొనేటంత ఘాతకురాలిననుకున్నావా? నేనూ ఆడదాన్నే! నేనూ ఆడదాన్నే! నేనూ ఆడదాన్నే రజియా!" పిచ్చిదానిలా అదేమాటను మరలా మరలా అంటూ రజియాను పొదివిపట్టుకొని ఏడ్వసాగింది. "నేను వెళ్ళను రజియా, నిన్ను వదలి. చస్తే ఇద్దరం చద్దాం ఈ పిల్లవాడిని చంపి."

"ఎందుకంతంత మాటలు? సుమతి కలుగజేసుకొంది. "నీవు కోడలిని వదలి వెళ్ళనన్నావ్. అదే నాకు సంతోషంగా వున్నది. ఏదో దారి ఆలోచిద్దాం. తొందరపడకండి."అంటూ "ఏది రజియా! నాకు మాట యియ్యి మరలా యిలా ఏఅఘాయిత్యం తలపెట్టనని. నీకు తల్లివంటి దానను" అన్నది చేయి చాపుతూ.

రజియా కన్నీటితో సుమతి పాదాలను అభిషేకించింది.

"ముసలివాళ్ళు ఛాందసులు అదీ యిదీ అనేవాళ్ళెవరైనా సుమతీ, ఫాతిమాలను ఆ మాట అనగలరా? ఎంతటి అంతః సంస్కారం దాగివున్నది యిరువురిలోనూ? దేశభక్తీ, సంఘోద్ధరణా అంటూ ఆర్భాటంగా తిరిగేవాళ్ళు వీరి కాలి గోటికైనా పోలుతారా?" అనుకున్నాడు అంతా చూస్తున్న ధీరజ్.

# 9

ఏ గదిలోను తల్లి కన్పించక హాలులోకి వచ్చి నిల

బడ్డాడు ధీరజ్. శైలజకూడా ఇంట్లోలేదు. వయో వృద్ధురాలు కావటం వలనా దానికితోడు మానసిక బాధలు క్రుంగ దీయటం వలనా ఫాతిమా త్వరగా నిద్రపోతుంది. ఆమెకు నిద్రాభంగం కలిగింప యిష్టం లేక అలాగే నిలబడిన ధీరజ్‌కు ప్రక్క గదిలో ఎవరో ఏడుస్తూన్నట్లు సన్నగా వినవచ్చిన ధ్వనికి అటు నడిచాడు ఖంగారుగా.

ఓరగా వున్న తలుపులను, నెమ్మదిగా నెట్టాడు.

అహ్మద్ పడుకున్న మంచంపై తలవాల్చి నిశ్శబ్దంగా రోదిస్తూన్నది రజియా, ఆమె ధీరజ్‌ను గమనించనేలేదు.

లోపలికి వెళ్ళబోయిన ధీరజ్ తటపటాయిస్తూ ఆగిపోయాడు.

"అహ్మద్! జ్వరం తగ్గలేదా?" అని పిలిచాడు.

రెండ్రోజులుగా జ్వరం వస్తూన్నది అహ్మద్‌కు. మందు ఇస్తూనే వున్నారు.

స్పృహలో లేని అహ్మద్ నుంచి జవాబులేదు.

రజియా లేచి ప్రక్కన నిలబడింది.

"ఏమిటే, జ్వరం ఎక్కువగా వున్నదా?" అనడుగుతూ లోపలికి నడిచి అహ్మద్‌పై చెయ్యివేసి చూచాడు. జ్వంరతో ఒళ్ళు కాలిపోతూన్నది. మూలుగుతున్నాడు కాని కన్ను విప్పటంలేదు.

"అమ్మలేదా?" రజియా నుద్దేశించి అడిగాడు ధీరజ్.

లేరు. బజారు వెళ్ళారు. అప్పటికి బాగానే వున్నాడు. యింత ఉధృతంగా లేదు." కళ్ళు తుడుచుకుంటూ చెప్పింది

రజియా. ధీరజ్‌తో ఆమె ముఖాముఖి మాట్లాడడం యిదే ప్రథమం, ఇన్ని నెలల అనంతరం!

"భయపడకండి. నేను డాక్టర్ని తీసుకొస్తాను." తక్షణమే పరుగెత్తాడు ధీరజ్ బయటికి.

"భయపడవద్దు. తగ్గిపోతుంది నాల్గురోజులలో." ఇంజక్షన్ చేసి వెళ్తూ డాక్టర్ అన్నాడు.

"తగ్గేవరకూ రెండు పూటలూ వచ్చి చూస్తూండండి డాక్టర్" అంటూ సాగనంపాడు ధీరజ్.

దుఃఖిస్తూన్న రజియాను ఒక్కర్తెనే వదలిపోవటం మానవత్వంగా కన్పించని అతడు అక్కడే అహ్మద్ పక్క మీద కూర్చున్నాడు అతడిపై చేయివేసి.

ఉన్నట్లుండి అహ్మద్ కలవరించ సాగాడు, ఏవేవో అర్థంలేని మాటలు.

డాక్టర్ వచ్చి వెళ్ళిన తర్వాత కొంతధైర్యం వహించిన రజియా ఇప్పుడు మరలా ఖంగారు పడసాగింది.

"అహ్మద్! నువ్వుకూడా నన్నన్యాయం చేయకురా. ఇక నేనెవరి కొరకు బ్రతికేదిరా?" అంటూ విలపించసాగింది.

ధీరజ్ గుండె ద్రవించిపోయింది, ఆ నిస్సహాయురాలిని చూచి.

"ఖంగారు పడవద్దు. తగ్గుతుంది. జ్వర తీవ్రతలో అలాగే అంటారు," అని శతవిధాల ఓదార్చ ప్రయత్నిస్తు న్నాడు.

"లేదు. ఈ జ్వరం తగ్గదు. ఆఖరికి అహ్మద్ కూడా నన్ను ద్వేషించి వెళ్ళిపోతున్నాడు. నేనెవ్వరికీ అక్కర్లేదు,"

అంటూ మంచం పట్టెకు నుదురు కొట్టుకోసాగింది, రోదిం చుతూ.

చటుక్కున లేచివెళ్ళి ధీరజ్ ఆమెను బలవంతంగా లేవదీసి, ధైర్యం చెప్పసాగాడు, "కష్టాలు వస్తాయి. కంగారు పడకూడదు."

"లేదు ధీరజ్ బాబూ. ఇక నేనెందుకు బ్రతకాలి ? ఇంకెందుకు నా బ్రతుకు?" అంతకంతకు దుఃఖం అధికమా తూన్నదే కానీ తగ్గటంలేదు.

"ఆహాహా!" శైలజ వెటకారస్వరం వినరావడంతో ధీరజ్, రజియాలు ఉలికిపడి చూచారు.

అప్పటికి ధీరజ్‌కు యదార్థం గుర్తువచ్చింది. "తనచేతు లలో రజియా?".

పొరపాటు చేసినవాడిలా రజియాను వదిలి రెండడు గులు దూరంగా నిలబడ్డాడు.

విహ్వాలురాలై చూడసాగింది రజియా. అలజడికి ఫాతిమా లేచి వచ్చింది.

"ఛీ, నువ్వింత......" ధీరజ్‌ను ఏదో అనబోయి అన లేనట్లుగా వెళ్ళిపోతున్న శైలజ అంతలోనే ఫాతిమాను చూచి ఆగింది. "చూశావా, ఏమేం జరుగుతున్నాయో యింట్లో? ముసలాళ్ళలాగా వయసువాళ్ళు హాయిగా తిని పడుకోలేరుగా? నాశనమైనవాళ్ళు అవ్వక మా యింటిని కూడ......"

"శైలూ!!" ఇటునుండి ధీరజ్, అప్పుడే ప్రవేశించిన సుమతి అటునుండీ అదలింపుగా అనడంతో శైలు ఒక్క-

క్షణం ఆగిందేకానీ, మరలా మొదలు పెట్టింది తగ్గనిస్వరంతో, "ఏం ఎందుకూ? శైలజ ఏం తప్పు చేయడంలేదు. ఇక్కడ జరుగుతూన్న భాగోతం ఏమిటో నీకేం తెలుసు, ఇప్పుడేవచ్చిన దానవు?" అన్నది తల్లితో.

ధీరజ్ సిగ్గిలిపోతూన్నట్లుగా నిలబడి తల్లికి ఏదో చెప్ప బోయి మరలా ఆగిపోయాడు.

"మాతాజీ...... అహ్మద్...... అహ్మద్......" అంటూ రజియా చెప్పలేక ఆగిపోయింది. ఆమె సుమతిని మాతాజీ అంటుంది.

"ఆఁ. ఏమిటీ, జ్వరం ఎక్కువైందా?" ఆత్రంగా వెళ్ళి అహ్మద్ ఒడలు నిమురుతూ ప్రక్కలో కూర్చున్నది సుమతి.

"ఏమిటి రజియా ఖంగారుపడ్తున్నదా, డాక్టర్ని తీసుకు రాలేదా నీవు?" అన్నది ధీరజ్‌ను.

"తీసుకొచ్చారు డాక్టర్ని. వైద్యం జరిగింది. కాని అహ్మద్‌స్థితి చూచి నేను ధైర్యం కోల్పోతే...... ధీరజ్ బాబు......" రజియా అసంపూర్తిగా వదిలేసింది ఫాతి మాను చూచి భయపడుతూ, ఏమంటుందోనని.

"ఆహా, ఓ ప్రక్కన తిన్నయింటికే వాసాలు లెక్క పెడ్తూంటే నువ్వు వాళ్ళ క్షేమంకోసం యిదౌతున్నావామ్మా? ఇలాగే కళ్ళుమూసుకూర్చుం...టే"

"శైలూ!" గది దద్దరిల్లేటట్లుగా అరచింది సుమతి. "పెద్దంతరం, చిన్నంతరం లేదా? వెళ్ళు నీ గదిలోకి. నువ్వేం చెప్పక్కర్లేదు."

"అమ్మా!" నిర్ఘాంతపోయింది శైలజ.

"నాకు కళ్ళూ చెవులూ వున్నాయి. నువ్వేం చెప్ప నక్కర్లేదు, వెళ్లు." కఠినంగా అన్నది సుమతి. "అభాగినులపై అభాండాలు వేయడం చాలా తేలిక. ఎందుకా నిర్భాగ్యురాలిపై అంత కక్ష నీకు?"

"ఇల్లు పూర్తిగా మునిగితే తప్ప నీకు తెలియదులే." ఫాతిమా దెస ఓ క్రోధ చూపు విసిరి వెళ్ళిపోయింది శైలజ.

శైలజ ఆరోపించుతూన్న ఆభాండమేమిటో అందరికీ అర్థమైంది.

పెద్దవాళ్ళైన ఫాతిమా, సుమతీ ఏమంటారోనని భయం భయంగా చూస్తూన్న రజియాను చూచి ఎంతైనా జాలి కలిగింది సుమతికి. రజియా కంటిధారలు ఒత్తుతూ, "సాయంత్రం నేను బజారుకెళ్ళేటప్పటికి బాగానే వున్నాడు కదా! ఇలాగుంటే నేనసలు వెళ్ళకేపోదును; తగ్గిపోతుందిలే." అంటూ ధీరజ్ దెసతిరిగి "సమయానికి నువ్వు రావడం మంచిదే అయ్యింది. వెళ్లుబాబూ స్నానంచెయ్యి. ఇక మేము కూర్చుంటాంలే యిక్కడ ఏంచేయను? నీకు తీరికేలేదు. శైలజకు బజారు వెళ్ళడం నామోషీ! అందుకు తప్పనిసరిగా నేను వెళ్ళాల్సి వచ్చింది," అన్నది.

తమను ఏమీ అనకుండా, ఎదురుతానే సంజాయిషీ చెప్పుకొంటూన్న సుమతి రజియా ధీరజ్ ఫాతిమాలు దేవతను చూచినట్లే చూచారు.

"నాకు చావురాదేం?" అంటూ ఫాతిమాను పట్టుకొని భోరుమన్నది రజియా. శైలజ ఎప్పుడేమన్నా లెఖచేసుకోని

ఆమె ఈనాడీ శైలజ చేసిన అవమానానికి మాత్రం దిగ్గుళ్ళి పోతూన్నది.

"అలా బాధపడవద్దు. శైలుకు నోటి దురుసు చాలా యెక్కువ. మీరు లెఖ్ఖ జేసుకోకూడదు." సుమతి క్షమాపణ కోరుతున్నట్లే అన్నది.

"ఆంటీ! క్షమించు మమ్మల్ని. మనసులో ఏం పెట్టుకోకు. రజియావల్ల ఏదోషమూ జరగలేదు." గబగబా అనేసి నిష్క్రమించాడు ధీరజ్ అక్కడినుండి.

ఆశ్చర్యంగా సంభ్రమంగాచూచింది ఫాతిమా ధీరజ్ పోతూన్న దెస "మీ అమ్మలాగే నీదీ అమృతహృదయం బాబూ. నేను మీపై అభాండాలు వేసేంత తక్కువ గుణపు దాన్ని కాను." అంటూ ఏడుస్తూన్న కోడలికనులు ఒత్తుతూ, "ఏడవొద్దు రజియా, నువ్వెందుకేడవాలి? ఎవళ్ళో చేసిన అన్యాయాలకు నువ్వెందుకు చావాలి? నిన్ను అన్యాయాలు చేసినవాళ్ళూ, అవమానించినవాళ్ళూ తలలు ఒంచుకునేట్లుగా నువ్వు నవ్వుతూ హాయిగా వుండాలి. అంతటి ఉన్నత హృదయు డుండాలేకానీ, ఆనాడు నా చేతులతో నేనే నిన్ను అలంకరించి మళ్ళీ పెళ్ళి చేస్తాను!" శపథం పట్టినట్టే అన్నది రజియాను అక్కున జేర్చుకుంటూ.

ఆమె హృదయ వైశాల్యానికి ధీరజ్ మనసున నివాళు లర్పించాడు.

సుమతి కనులతోనే ప్రసంశించింది.

# 10

ధీరజ్‌తో ఏదో మాట్లాడవచ్చిన సుమతి, అతడు కిటికీ నుండి తదేకంగా చూస్తూన్న దృశ్యమేమిటా అని ఆరాగా చూచింది.

బయట ఆవరణలో మామిడిచెట్టు నీడన పరధ్యానంగా కూర్చునివున్నది రజియా, చెక్కిట చేయిజేర్చి.

"పాపం! భర్త బ్రతికుండాలీ అని వేయి దేవుళ్ళకు మ్రొక్కింది. బ్రతికుండి ఏం లాభం? ఎప్పుడూ అలాగే కూర్చుని వుంటుంది. ఎంత అణకువ? ఎంత బుద్ధిమంతనం! నజీర్ మంచిపని చేయలేదు." అన్నది సానుభూతిగా.

"హుఁ!"

"బాగానే చదువుకుందట, నువ్వేదైనా ఉద్యోగం వేయించగలవా ధీరజ్?" ధీరజ్ ఆశ్చర్యంగా చూచాడు.

"అదికాదు, మనకి బరువనికాదు. ఓ కాలక్షేపం వుండి తనబాధ మరచిపోతుంది. ఒకరిమీద ఆధారపడి వున్నామనే న్యూనతా భావంకూడా వుండదు."

"ఎంత వెఱ్ఱిదానవమ్మా! పరిస్థితులు చక్కబడగానే వాళ్ళదేశం వాళ్ళు వెళ్ళితీరాలి. ఒక దేశస్థులు మరోదేశంలో వుండటానికి చాలా అనుమతులూ వగైరాలు కావాలి. అయినా యింత నోరులేనిది నలుగురిలో ఎలా బ్రతుకుతుంది? ఇటువంటివాళ్ళను కాకుల్లా పొడిచే సంఘం కాదూ మనది?"

నిట్టూర్చింది సుమతి. "ఏమిటో ధీరూ! వాళ్ళకి నాశక్తి మేరకు ఎంతైనా చెయ్యాలని వున్నది."

"చెయ్యమ్మా. వద్దన్నానా నేను?"

"అదికాదు, ఏమిటో ప్రభుత్వాలూ అనుమతులూ అంటున్నావ్‌గా మరి? ఒక నాడు నన్నూ నా బిడ్డలనూ అనాథాశ్రమాల పాలుగాకుండా అత్యాచారాలకు బలికాకుండా కాపాడి, మానమర్యాదలు నిలబెట్టినవాళ్లను నేనెలా మఱచిపోగలను? ఆనాడు హైద్రాబాద్‌లో కూడ అల్లర్ల తర్వాత యీ రజియాలాగే ఎవరో స్త్రీలు, స్వజనులచేతనే పరిత్యజించబడి నిరాశ్రయులై అల్లాడారు. అటువంటి వారి కోసమే మహిళా సమాజాలూ, ఆశ్రయాలూ వెలిశాయి. అప్పుడు మహాత్ముని ప్రోద్బలంవల్ల; కానీ... అంతకంటే మంచిదారి ఏదైనా మనం చూపగలమా అని ఆలోచిస్తున్నాను ధీరూ. ఏమిటో నా మనస్సు నాకే అర్థంకాకుండా వున్నది."

అంతలోనే రజియా ఖంగారుగా లోనికి పారిపోవడంతో కారణ మేమిటా అని చూచారు. శైలజ తన బృందంతో వస్తూన్నది. శైలజనూ ఆమె స్నేహితులనూ చూస్తూనే రజియా భయపడి దాకుంటుంది.

"ఏమండీ? వాగ్దానం గుర్తున్నదా? ఈసారి మిమ్మల్ని వదలిపెట్టేది లేదు."

"బలవంతంగా ఈడ్చుకెళ్తాం."

ఒకరిని మించిన స్వరంతో ఒకరు మాట విసురుతూ పకపకలాడుతూ ధీరజ్‌పై దండెత్తారు శైలజ స్నేహితులంతా.

"అదేమిటో వివరంగా చెప్పండి, సావధానంగా కూర్చుని. ఇలా రణగొణ ధ్వని నాకు కించిత్ భయం." భయపడుతున్నట్లుగా చేతులు జోడించి ప్రార్థించాడు ధీరజ్.

మరలా అందరూ నవ్వి కూర్చున్నారు.

"మీరు వాగ్దానం చేశారు గుర్తులేదూ? మా లేడీస్ క్లబ్ ఆర్గనైజేషన్స్ ఒక దానికి తప్పక వస్తానని......"

"గ్రాండ్ రిపోర్టు వ్రాస్తానని...పత్రికలో"

"మా ఫోటోలు వేస్తాననీ..."

ఒక్కొక్కరు ఒక్కొ విషయాన్ని విపులీకరించ సాగారు.

"జ్ఞాపకం వచ్చింది." బుద్ధిగా ఒప్పుకున్నాడు ధీరజ్.

"హమ్మయ్య! జ్ఞాపకం వున్నదిక దా;" ఒకామె కుర్చీలో అటు యిటు ఊగిపోతూ, అనవసరంగా పమిట సర్దుకుంటూ అన్నది. "మాట నిలబెట్టుకుంటారా?"

ఎవరినీ ఉద్దేశించకుండా శైలజ అసహనంగా ఓ గావు కేక పెట్టింది. "మంచినీళ్లు! ఇంటికెవరైనా వస్తే ఏం కావాలని అడిగే దిక్కులేదు. కాసిని మంచినీళ్లు ముఖాన పోసే వాళ్లు లేరు. ఇంట్లో యిందరున్నారు మళ్ళీ."

ఆ విసురు ఎవరి నుద్దేశించో అందరికీ తెలుసు.

అంతలో రానే వచ్చింది ఫాతిమా మంచినీటికూజా, గ్లాసులూ సరంజామాతో.

"ఇక మీనెత్తిన శాశ్వతమన్న మాట ఈ జిడ్డు!" ఒకామె మెల్లగా శైలజతో అన్నప్పటికీ అందరూ విన గలిగారు.

"ఆఁ. నేలన పోయేది నెత్తిన రాచుకొనే వాళ్లుంటే సరి! అంతా ఎక్కుతారు నెత్తిన!" శైలజ సమాధానం.

"ఇంతకూ... మీరు ఏమిటి ఆర్గనైజ్ చేయబోతున్నారీసారి?" ధీరజ్ అడిగాడు వారి ప్రసంగధోరణిని మార్చే ఉద్దేశ్యంతో.

మళ్లా అందరూ ఉత్సాహంగా మాట్లాడసాగారు.

"ఈ దీపావళికి మంచి ఫంక్షన్... అంటే ఈసారి ఎగ్జిబిషన్లవీ లేవు. డిస్కషన్సు అదే చర్చలు, తర్వాత భోజనం. ఏ మంచి మంత్రిగారినో-ఎవరినో ఇంకా అనుకోలేదు లెండి. మంచి పలుకుబడైనవారిని అధ్యక్షులుగా పిలుస్తాం."

"మంచిదే, చర్చలు దేనిగురించీ?"

"హ్యూమన్ రైట్స్‌డే లాగే వుమెన్ రైట్స్‌డే అని ఓటుండాలని మా వాదం. స్త్రీలహక్కుల గురించి, అన్ని రంగాలలోనూ సమానహక్కులుండాలని చర్చలు జరుపుతాం."

"మీరు క్షమిస్తే నాదొక్క చిన్న సందేహం." ధీరజ్ అడిగాడు. "మరేంలేదూ, కేవలం కుతూహలంగా అడుగుతున్నానంతే."

"అయ్యో, అడగండీ."

"చూస్తే మీ రందరి జీవితాలూ... చాలా హాయిగా సాఫీగా సాగుతున్నట్టే వుంటాయి. మరి మీకేం తక్కువని ఈ హక్కులూ, పోరాటాలూ?"

"అదుగో!" తారాజువ్వలా లేచిందొకామె. "ప్రతి మగవాడూ అలాగే మాట్లాడతాడు. మాకేం తక్కువని

మెల్లగా అడుగుతున్నారా?" గింజుకుంటూన్నట్లే అన్నది.

"ఆరోపించిన హక్కులేమిటో చెప్పమనే అడుగుతున్నాను."

ఇద్దరు స్త్రీలు అందుకున్నారు: "అనాది నుండి పురుషుడు స్త్రీకి అన్యాయం చేస్తూనే వున్నాడు. స్త్రీ భరిస్తూనే ఉన్నది. ఇక ఆధునిక యుగంలో మాత్రం అది చెల్లనేరదు. స్త్రీకి సమానహక్కులు కావాలి. స్త్రీ అబలకాదు సబల అని నిరూపించుతాం. మేము దేనికీ ఒదిగి వుండం."

"వుండకండి. ఇవన్నీ చిలకపలుకుల్లాగా ఒకరినిచూచి ఒకరు అనేవేకాని వీటిబరువెంత--అని అడుగుతున్నాను." అందర్నీ పరీక్షగా చూశాడు ధీరజ్ ఈ మాటలు అంటూ. "వేదికలమీద ఉపన్యాసాలు దంచితేనూ, క్లబ్బులూ అర్భాటాలతో తిరిగి అవి పత్రికలలో ప్రచురించుకొంటేనూ వచ్చేస్తాయా సమాన హక్కులు?"

అందరూ ముఖముఖాలు చూసుకున్నారు.

"మీరు మమ్మల్ని హేళన చేస్తున్నారు." అంది ఒకామె ముఖం కందగడ్డలా కందిపోగా ఉక్రోషంతో.

"ఇంతకూ మీరు చెప్పదలచుకున్నదేమిటీ?" మరొకావిడ కోపంగా అడిగింది.

ధీరజ్ తమాషాగా నవ్వాడు. "నేను చెప్పటానికేం లేదు. మీరు చెప్పేవేమిటో అయోమయంగా వున్నాయి. వివరంగా చెప్పమని కోరుతున్నాను, అంతే."

ఇదేదో చిక్కుప్రశ్నలాగా అందరు వనితలూ ఒకరి నొకరు కళ్ళతోనే ప్రశ్నించుకున్నారు.

ధీరజ్ అన్నాడు తిరిగి:

"సమానహక్కులు అని స్త్రీలు వాపోవడం, సమానత్వం అని రాజకీయవేత్తలు వగర్చడమూ ఎప్పటినుంచో వింటున్నాం. కానీ అది ఏమిటో నాకు తెలిసిచావడం లేదు. పురుషులతో సమానంగా చదువుకుంటున్నారు; ఉద్యోగాలు చేస్తున్నారు. పురుషునికంటే టిప్‌టాప్‌గా తిరుగుతున్నారు. వాడు ఆఫీసులో తప్పనిసరిగా మగ్గేవేళల్లో మీరుహాయిగా విశ్రాంతిగా లేక క్లబ్బుల్లో వుంటారు. స్త్రీలకు ప్రత్యేకం అంటూ క్యూలూ, రైలుడబ్బాలూ అన్నీ వుంటాయి కానీ పురుషులకు ప్రత్యేకం అనే వెక్కడా లేవు. ఈలెఖ్ఖన మీరు పురుషులకంటే అధికంగా లేరు?"

"అదుగో, మీరు ఈటెల్లాంటి మాటలు విసుర్తున్నారు" గునుస్తూ అన్నదొకామె. "వంటయింటి బానిసను చేయటంలేదూ స్త్రీని?" అన్నది సగర్వంగా ఒక పాయింటును చెప్పగలిగానని ధీమాగా చూస్తూ.

"మీరనవలసిన మాటకాదది. మీ అందరిళ్ళల్లో వంటమనుషులూ ఆయాలూ వున్నారు, నాకు తెలుసు. అందుకే ఇంతింత స్వేచ్ఛగా తిరగటానికి మీకు తీరిక లభిస్తున్నది!"

అందరి ముఖాలూ అప్రసన్నంగా వున్నాయి.

ధీరజ్ సవాళ్ళకు ఎవ్వరూ తగిన సమాధానం ఈయలేకపోయారు.

సగర్వంగా నవ్వి కళ్ళెగరేస్తూ అన్నాడు ధీరజ్;

"చూశారా మీకేం కావాలో మీకే తెలియదు పసిపిల్లల్లాగ. ఇక మీరేం చేయగలరు! ఏం పోరాడగలరు?"

"అన్నయ్యా!" శైలజ కోపంగావుందని ఆమె సంబోధించిన తీరే చెప్తూన్నది.

"ఓ!" ధీరజ్ నవ్వేశాడు. "ఈ టాపిక్ వదిలేద్దాం లెండి అన్నట్టు...సునీతగారూ మీరు మళ్ళీ పెళ్ళి చేసుకుంటారని విన్నాను. నిజమేనా?" అన్నాడు ఓ మాజీ మంత్రిగారి కుమార్తెను చూచి. ఆమెకు భర్త విడాకులిచ్చి ఏడాది దాటింది.

అందరూ తమాషాగా చూశారు సునీతను.

సునీత కోపంతో నాసికాపుటాలెగరవేస్తూ, "ఎవడా అన్నవాడు? తెలిస్తే అయిపులేకుండాచేయిస్తారు మానాన్నగారు. కిట్టని వెధవలు యిలాంటి పుకార్లు పుట్టిస్తుంటారు మంచి కుటుంబాలమీద. మా యింటా వంటాలేదు ఆడది అలాంటి దరిద్రపు పని చేయడం."

"అంతేలెండి" అంటున్న ధీరజ్ మరో ప్రౌఢపైకి తిరిగింది. నలభై ఏళ్ళు దగ్గరపడ్తూన్న ఈ వయసులోవివాహం చేసుకున్నదామె. భార్యను వదలిపెట్టిన ఓ పెద్ద వర్తకుని. ఈమెను చేసుకోవటానికే ఆమెను వదలిపెట్టాడసలు.

"అదేమిటండీ ఛాయాదేవీ? మీరుకూడా అందరు సామాన్య స్త్రీలలాగానే పెళ్ళవ్వగానే భర్తపేరును చివర తగిలించేసుకున్నారు? విప్లవపంథాతో ఊహించే మీకు ఈ ఆచారం నప్పలేదు" అన్నాడు.

"లేకపోతే ఎలాగ? మన ఆచారం అదేగా మరి?" అన్నది ఆమె అతి మామూలుగా.

కథా నిలయం
5924
3-83
శ్రీకాకుళం

పకపకా నవ్వేశాడు ధీరజ్.

"చూశారా, హక్కులు కావాలని మీనోళ్ళు అడుగు తున్నా మీ నరనరాలలో వున్న అనాది ఆచారం నమ్మిక ఏమంటుందో?"

అందరూ తికమకపడ్తూ చూడసాగారు.

వారు తనకిచ్చిన ఆహ్వాన పత్రికమీద పేర్లన్నీ వర నగా చదివాడు పైకి... 'సీమా చతుర్వేది, అర్చనా అగ ర్వాల్, భాస్కరలక్ష్మి రామారావు, మాలినీ కందూర్, రాధా భాటియా, అరవిందామూర్తి, కమలాజగన్నాథం, లలితా దామోదర్, షీలా పటేల్, మిసెస్ రావు, కుమారి ప్రేమ ఖన్నా, మిసెస్ శర్మా...'

"ఏమిటిదంతా? ఫలానావారి భార్య, ఫలానావారి కుమార్తె అని చెప్పుకుంటేనే కాని! మీ అసలు పేర్లకు విలువా గుర్తింపూ లేవన్నమాట? ఇలా మగవారి పేర్లు తగిలించుకున్నది మీరేగా, అందులో ఎవరి బలవంతమూ లేదుగా?"

ఎవ్వరూ మాట్లాడలేదు. అపరాధినులవలె తలలు వొంచుకున్నారు.

"పురుషులెవరు? ఒక స్త్రీకి భర్త. మరొక స్త్రీకి సోదరుడు, ఇంకొక స్త్రీకి పుత్రుడు. స్త్రీనుండి అతడు వేరు కానేకాదు. స్త్రీలో ఒక భాగమే! స్త్రీయే పురుషుని కంటు న్నది, శిక్షణనిచ్చి పెంచుతున్నది. మరి తాను జన్మనిచ్చి శిక్షణ నిచ్చిన పురుషునితో నేనా దెబ్బలాడేది? తనతో

సమంగా పుట్టిన సోదరునితోనా దెబ్బలాట? లేక తనకు జన్మనిచ్చిన తండ్రితోనా?" శ్రోతలు ఎవ్వరినుండీ ఎటువంటి సమాధానమూ వినరాలేదు.

"స్త్రీని బానిసను చేసినది పురుషుడు కాదు! ఆమె సుకుమారత్వం! బిడ్డలకు జన్మనిచ్చి సాకవలసిన ఆమె ప్రకృతి ధర్మం! అందువల్ల సమానహక్కులు కావలసినవారు ఈ ధర్మాలతో పోరాడాలి."

"అదెలాగ?" ఒకామె అడిగింది.

"మాకు పిల్లలు అవసరం లేదు. పురుషులతో సమంగా వుంటాం అని."

"బాగుంది. మీరు అసాధ్యాలన్నీ చెప్తున్నారు. మమ్మల్ని అవహేళన చేస్తున్నారు. చచ్చి పైకిపోయి దేవుడిని అడగమా ఏం ఈ పద్ధతిని మార్చమని?"

"లేదండీ. చూశారా మీరెంత పొరుషపడ్తున్నారో! ఎందుకంటే పిల్లల్లేకుండా గొడ్రాలిగా వుండాలని ఏ స్త్రీ కోరుకోదు గనుక, అది ఆమె ప్రకృతి ధర్మం!"

"ఏమిటో అంతా గంద్రగోళంగా వుంది."

"ఏమీలేదు, వివరంగా చెప్తాను వినండి. సాధారణంగా ఆడపిల్లలంతా పెళ్ళిళ్ళు చేసుకొని భర్తయింటికి వెళ్ళాలి. భర్త యింటిపేరుతోనే వ్యవహరింపబడాలి. మరి మీరంతా సమాన హక్కులు కావాలంటున్నారు గనుక భర్తనే మీ యింటికి రమ్మని మీ పుట్టింటివారి పేరుతో వ్యవహరించమనగలరా? భర్తను మీరు - అండి అనడం

మానేసి 'నువ్వు' అనగలిగినవారెంతమంది?

ఉదాహరణకి మీరు లక్ష్మీరావు; మరొకావిడ కమలా జగన్నాథం. ఈ రివాజు మానేసి మీరు లక్ష్మిగానేవుండండి. ఆవిడ కమలగానే వుండలేరూ? లేదా మీ మగవారిని శ్రీరావు లక్ష్మి, శ్రీ జగన్నాథం కమలా అని వ్రాసుకోమనండి వారి పేరులు. ఈ విప్లవపరిస్థితి బాగులేదూ? స్త్రీ తనకంటే అధిక వయస్కునే వివాహమాడటమేం? చిన్న వయస్కులనే చేసుకొంటాం ఎదురు కట్నాలు తీసుకొని అని భీష్మించుకూర్చోరేం?"

"బాబోయ్, మీ అన్నయ్యకు మతిభ్రమణం కానీ కలగలేదు కదా శైలూ?" గాభరాగా శైలజకు దగ్గరగా జరిగికూర్చుంది లక్ష్మీరావు.

మిగిలినవాళ్ళుకూడా కొందరు భయంగా, కొందరు నిరక్ష్యంగా, కోపంగా చూడసాగారు.

"మీ అన్నకు త్రాగే అలవాటుందా శైలూ? పాపం ఈరోజు డోస్ ఎక్కువవ్వలేదుగా?" షీలా పటేల్ తగ్గు స్థాయిలో అడిగింది.

"లేదు." సమాధానం ధీరజ్ నుండి వచ్చింది. "అన్నట్టు మీరు మంచిసంగతే గుర్తుచేశారు. మీ పటేల్ గారికి ఆఅల వాటు బాగా వుందికదా? మరి సమానహక్కు వాంఛించే మీరుకూడా త్రాగి హక్కును నిలబెట్టుకుంటున్నారా? మీరంతా సిగరెట్స్ కాలుస్తారా?"

"డామిట్!" కాలితో క్రోధంగా నేలను తన్నుతూ

లేచిపోయింది శీల. "పదవండే పోదాం. ఏమిటీ బోర్, ఏదో కాస్త పేపర్లో వేసిపెట్టమన్నాం కదా అనీ..."

"ప్లీజ్!" ధీరజ్ చేతులు జోడించితూ అర్థింపుగా అన్నాడు: "మీకు కోపంవస్తే క్షమార్హుడను. మిమ్మల్నవమానించాలనే దురుద్దేశం ఎంతమాత్రమూ లేదు నాకు. కేవల నినాదాలవల్ల లాభంలేదూ; కార్యాచరణకు పూనుకొని సాధించే విధంమాత్రం యిదీ— అని మాత్రం చెప్పానంతే"

"ఉద్ధరించారులెండి. ఇక ఇలాగైతే మేం సంసారాలు చేసినట్లే" మూలన్నుంచి ఓ కంఠం ఉరిమింది.

ధీరజ్ చలించలేదు. "ఇదీ మంచి పాయింటే. సంసారాల గురించి అంత భయపడటం దేనికీ మీరు? పురుషుడు ఎన్ని పెళ్ళిళ్ళయినా చేసుకుంటున్నాడు; అలాగే స్త్రీలు కూడా ఒకడొదిలేస్తే ఏముందీ? మళ్ళీ పెళ్ళిచేసుకోవాలి."

"వ్హాట్!?!" నాలుగైదు కంఠాలు ఒక్కసారే అరిచాయి కూర్చున్న తావునుండి అరగజం ఎత్తున ఎగిరిపడ్తూ.

"ఆఁ. అదేనండీ సమానహక్కు—?" చాలా ప్రశాంత స్థాయిలో తల పంకిస్తూ అన్నాడు ధీరజ్. "మాయింట రజనీ ఉన్నదికదా! ప్రారబ్ధంకొద్దీ ఏదో జరిగింది. ఆమె తప్పులేదు. అయినా భర్త ఆమెను పరిత్యజించాడు. ఆమె జీవితానికి ఇక ఎటువంటి దారి వుండాలని మీ అభ్యుదయ వాదినులంతా అనుకుంటున్నారు?"

ముఖముఖాలు చూచుకున్నారు కొన్ని క్షణాలు.

"ఏముందీ? వున్నాయిగా శరణాలయాలు? ఆదుకునే బంధువూ, చదువూ లేకుంటే అవే గతి మరి!" అన్నారు ముక్తకంఠంతో.

"ఇంతేనా? మరోదారి లేదా?" ప్రతి ఒక్కరి ముఖమూ పరీక్షగా చూస్తూ అడిగాడు ధీరజ్. "మీరంతా కలిసి ఆమెకు మరలా వివాహంచేసి, గర్వాంధులైన పురుషులకు బుద్ధిచెప్పలేరూ?"

"మరేపాపం!" ఈసడించినట్లుగా అన్నది లక్ష్మిరావు.

"శుభ్రమైన కన్యలకు పెళ్ళిళ్ళయ్యే దిక్కులేకుండా వున్నది. నాలుగేళ్ళ కొడుకున్న దాన్ని పెళ్ళాడే గతిమాలిన వాడెవడూ వుండడనుకుంటాను."

"బాగా చెప్పావ్." పదికంఠాలూ మద్దత్తుగా పలికాయి.

"అభ్యుదయవాదులైన మీరలా మాట్లాడటం బాగుండలేదండీ." ధీరజ్ విడువని పట్టుదలతో వాదం సాగిస్తున్నాడు. "గతిమాలినవాడు కాదు. అటువంటి వ్యక్తి ఆదర్శవాది అన్పించుకుంటాడు."

"ఎవడో కానీ, మనదేశంలో అటువంటి వాడుండడు," కచ్చితంగా అన్నది కమల.

"ఏమో ఎవరు చెప్పగలరు? వుండవచ్చు ఏ నాబోటి వాడో!" ఇంటూ ఆగి అందరిదెసా పరీక్షగా చూచాడు.

అతనూహించినట్లే అన్ని ఆకారాలూ ఉలికిపడి సర్దుకూర్చున్నాయి.

"అటువంటు ఆదర్శవివాహం చేసుకొని ఓ సాటి స్త్రీ బ్రతుకును ఉద్ధరించమని మీ అన్నదమ్ములెవర్నీ మీరు బోధించి ప్రోత్సహించలేరూ?"

"ఏం ఖర్మకాలిందీ మా అన్నదమ్ములిలాంటి భంగ పడ్డదాన్ని పిల్లలతల్లినీ చేసుకోవటానికి?" నలుగురు ఛీదరించుకున్నారు.

"పోనీ, ఆమె మీద అంత జాలి వుంటే మీరే చేసుకుని ఆ ఆదర్శ కిరీటం తగిలించుకోరాదూ? ఎటూ ఇంట్లో పెట్టుకునేవున్నారయ్యే; యించుమించు ఏడెనిమిది నెలలుగా!' ఒకామె అహంకారంగా అన్నది.

"బాగా చెప్పావ్ మిసెస్ భాటియా!" మరొకామె అభినందించింది. "ఒకరికి చెప్పేది మీరేచేస్తే పోతుందిగా?"

ధీరజ్ ఏమీ చలించలేదు, "థాంక్స్" అన్నాడు నిర్మలంగా నవ్వుతూ. "పోనీ నేనే ఆ వివాహం చేసుకుంటాననుకోండి. మీరంతావచ్చి అభినందించి ఆశీర్వదించుతారుగా?"

ఒక్కసారిగా గాలి స్తంభించిపోయినట్లుగా అయ్యింది ఆ గదిలో.

"మా అమ్మగారి అనుమతితో నేను రజియాను వివాహం చేసుకోబోతున్నాను ఆర్భాటం వుండకపోయినా, ఆ వివాహానికి ఏతెంచి మీ మీ హృదయ వైశాల్యతను చాటుకోండి."

'తాము విన్నది నిజమేనా?' అన్నట్లు అందరూ ఉలికి

పాటుతో చూచి, అంతలోనే "వస్తాం. చాలా ఆలస్యమైంది," అంటూ విసవిసా వెళ్ళిపోయారు.

శైలజ కన్నీళ్ళతో ధుమధుమలాడుత్తూ తల్లి వద్దకు వెళ్ళి ఫిర్యాదుచేసింది. "చూడమ్మా. నా స్నేహితుల్ని అన్న ఎలా అవమానించి పంపాడో! ఛ. మళ్ళీ వాళ్ళకు ముఖం ఎలా చూపను?"

"ఏమన్నాడు?" శాంతంగా ప్రశ్నించి, సుమతి ప్రశాంతంగా విన్నది సుమతి వివరాలన్నీ.

ఇంత దారుణమైన వార్తవిని తల్లి ఏడ్చి శోకాలు పెట్టకపోవటం అటుంచి కించిత్ అలజడినికూడా ప్రదర్శించక పోవడం మరింత దారుణంగా కన్పించిది శైలజకు.

"అదేమిటమ్మా నిమ్మకు నీరెత్తినట్లుగా అలాచూస్తావ్ కొంపలంటుకు పోతుంటే? ఆ దారినపోయే గతిమాలినది యింటి కోడలై కూర్చుంటుందా? అన్నకు మతేమీా..."

ధీరజ్ వచ్చి నిలబడ్డాడు. "శైలూ, ఇక నీవీ ధోరణి కట్టిపెట్టాలి. నే చెప్పిందంతా అబద్ధమేమీా కాదు. కాని జరగడానికి కొంత ఆలస్యం మాత్రం ఔతుంది. ఎందుకంటే ప్రభుత్వానుమతీ వగైరాలు తీసుకోవల్సి వుంటుంది. ఇక నీవు నీ నాలుకను అదుపులోపెట్టుకుని ఆవిడను వీలైనంత గౌరవంగా చూడటానికి ప్రయత్నించు."

శైలజకు కళ్ళు తిరిగిపోయాయి. "జాతీ, కులమూ అన్నీ యిలా ధ్వంసం చేస్తావా? మీా బావగారు, మా అత్త వారు నన్నెంత చిన్నచూపు చూస్తారు? నన్నసలు యింటికి రానిస్తారంటావా?" వెక్కిళ్ళతో అడిగింది.

"ఏం, ఏంరోగం ఆయనకు? అంత గొప్ప గాంధీ భక్తుడు కదా? గాంధీగారి సూత్రాలు గుర్తుచెయ్యి, ఏమైనా తలతిరిగితే ఆయనకు"

"చాల్లే, నీకు అలాగే హేళనగా వుంటుంది. ఎవతె కోసమో నా బ్రతుకు బుగ్గిచేస్తావా?"

"ఛీఛీ. సిగ్గులేదూ శైలూ. నీ కిలాంటి దీనాలాపాలు చేయటానికి? పెద్ద సమానహక్కుల కోసం లెక్చర్లిచ్చి పోరాడగల ధీర వనితవు కదా, భర్తను ఆ మాత్రం నిలదీసి అడగలేవూ? ఇంతేనా మీ నాగరిక స్త్రీల భండారం?"

శైలు తలెత్తలేదు, అలా దుఃఖిస్తూనే వున్నది.

"నేను నిన్ను వెక్కిరించుతున్నాననే అపోహ లేకపోతే ఒక్క మాట. అర్థంచేసుకోవటానికి ప్రయత్నించు. తాము ఎయిర్ కండిషన్డ్ డబ్బాలలోనూ ఎయిరిండియాలలోనూ మాత్రమే పయనిస్తూ. తమ పిల్లలను విదేశాల విద్యకొరకు మాత్రమే పంపిస్తూ, వేదికలెక్కి సర్వసమానత్వాన్ని సాధిస్తున్నాం-దగ్గరకొచ్చేసింది ఇంకెంతో దూరం లేదూ అంటూ ప్రజలకు ఉపన్యాసాలిచ్చి మతి పోగొడ్తూన్న గొప్ప నాయకులలో ఒకడు మీ ఆయన. ఎక్కడచూచినా సినిమాల్లో రైళ్ళల్లో—ఒకటేమిటి— ఫస్ట్‌క్లాస్, సెకండ్‌క్లాస్ అంటూ విభజన, ఈ విభజన యేమిటోయ్—అంతా ఒకేక్లాసు చేయండి, సర్వసమానత్వం అక్కడనుండి ప్రారంభించండి-అని అడగటం రాదు పిచ్చి ప్రజలకు. అలాగే గంగిరెద్దువేషం వేసుకొని విఱ్ఱవీగే మీ వన్నెల విసనకర్రలకు సమానహక్కులంటే ఏమిటో అవి సాధించటానికి త్రొక్కవలసిన దారి ఏమిటో కూడా తెలియదు.

"మీ మట్టుకు మీరు హాయిగా బ్రతుకుతూ, మీ అర్థంలేని నినాదాలతో తెలిసీ తెలియని అమాయకుల బుర్రలనుమాత్రం పాడుచేసి వదలిపెడ్తున్నారు. నీ అన్న మతాంతర వివాహం చేసుకుంటే, దేశభక్తుడైన నీ భర్త నిన్ను వదలిపెడ్తాడేమో ననే భయంతో శోకాలుపెట్టి నీవు వేరుదారి లేక నీ యింటికి ప్రాణరక్షణ కొరకై జేరిన ఒక అభాగినిని సాటి మనిషిగా స్త్రీగా కూడా గుర్తింపలేని నీవు స్త్రీల హక్కు-లూ గొడవా అంటూ అసలాపదలే ఎత్తటానికి అనర్హురాలవు. ఆయనకు కోపంవస్తే నచ్చజెప్పలేవా? ఆయన వదిలిపెడ్తే ధైర్యంగా నిలబడలేవా? ఇంటగెలిచి రచ్చగెలువు.

"రజియాయే కాదు. ఎందరో అభాగిలున్నారు మన ఈ సమాజంలో. వారిని ఉద్ధరించలేకున్నా మన్ననగా, గౌరవంగా చూడగలగడం మీ స్త్రీలు అలవరచుకుంటే అదే ఆ గుర్తింపే స్త్రీల పాలిట దివ్యదీపావళి ఔతుంది!

"నేనీ వివాహం తప్పక చేసుకు తీరతాను. అమ్మకు నాగరికవేషాలు తెలియవు. నాగరికత అంటేనే తెలియను. అయినా ఆమె హృదయం ఎంతో విశాలం. తప్పకుండా అనుమతిస్తుంది. అలాగే ఫాతిమా ఆంటీ. ఆమె తన చేతులతో కోడలిని తిరిగి పెండ్లికుమార్తెగా అలంకరించి పెండ్లి జరిపించగల ధీశాలిని, కొడుకుచేసిన అన్యాయానికి, కోడలి కష్టాలకూ ఆమెఎంత వాపోతున్నదో చూడు!

"అటువంటి స్థాయిని అందుకోగల మానసిక దారుఢ్యం కొరకు మీ స్నేహితురాండ్రంతా ప్రయత్నించి సాధించిన నాడు మీ జీవితాలేగాక మీ చుట్టూవున్న యువతుల-స్త్రీల జీవితాలలో కూడ దివ్యదీపావళి వెల్లి విరియ గలదు!"

***